ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 5 నవంబరు 2024



మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగించి, హారతి ఇస్తున్న దంపతులు

ఓం నమశ్శివాయ!

'హరహర మహాదేవ శంభోశంకర... శంభో శివశంభో' అంటూ భక్తుల శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగాయి. కార్తీక మాసంలో తొలి సోమవారం సందర్భంగా శివకేశవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జాము నుంచే పాలభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపారాధనలు, స్వామివార్లకు ప్రాకారోత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

నిండుకుండలా

సోమశిల, కండలేరు

మొదటి పంటకు నీటి కొరత తీరినట్టే 7



టీడీపీ 40.. వైసీపీ 13..

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఏం జరుగుతుంది!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు నగర పాలక సంస్థలో తొలి సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. మొన్నటిదాకా అధికార తెలుగుదేశం పార్టీకి ఒక్క సభ్యుడు కూడా లేని ఈ కౌన్సిల్లో ఏకంగా 40 మంది సభ్యులు ఉన్నారు. 13కి పడిపోయిన వైసీపీ బలంతో ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయడంతో కౌన్సిల్ సభ్యుల సభ్యుల 53కి చేరింది. కాగ రాష్ట్రంలోనే సంచలనంగా మారిన కమిషనర్ సంతకాల ఫోర్జరీ అంశాన్ని ప్రస్తుత సమావేశంలో సభ్యులు ప్రశ్నిస్తారా!? వైసీపీ హయాంలో జరిగిన ఈ భారీ ఆర్థిక కుంభకోణంపై చర్చకు పట్టుబడతారా!? అన్నది ఆసక్తికరంగా మారింది. 73 తీర్మానాలతో అజెండాను సిద్ధం చేసిన అధికారులు నేటి సమావేశానికి సర్వం సిద్ధం చేశారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

73 తీర్మానాలతో అజెండా సిద్ధం ● కార్పొరేటర్ల వ్యూహం ఏమిటి? ● సంతకాల ఫోర్జరీపై ప్రశ్నిస్తారా!? ● ఎవరి వాదన ఎలా ఉండబోతుంది?



కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం

నెల్లూరు కార్పొరేషన్‌లో గత కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ. కోట్లు దోచుకున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కుంభకోణంపై మంగళవారం జరిగే నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనినే ప్రధాన అజెండాగా సభ్యులు చర్చకు పట్టుబట్టే అవకాశం ఉన్నట్లు కార్పొరేషన్, రాజకీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 26 మంది కార్పొరేటర్లు ఉండగా, ఆరుగురు మినహా మిగిలిన వారంతా టీడీపీలోకి వెళ్లిపోయారు. అటు 27 మంది ఉన్న (ఒకరు రాజీనామా) నెల్లూరు నగర నియోజకవర్గంలోనూ ఏడుగురు మినహా 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తంగా 40 మంది టీడీపీ, 13 మంది మాత్రమే నేటి కౌన్సిల్‌లో వైసీపీకి బలముంది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లు ఫోర్జరీ స్కాంపై ఎంతమాత్రం చర్చిస్తారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది.

● 73 తీర్మానాలతో అజెండా

కౌన్సిల్ సమావేశంలో 73 తీర్మానాలను అజెండాలో చేర్చారు. ఇందులో... - మిగతా 6లో..

టెట్ ఫలితాలు విడుదల

● జిల్లాలో 45 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అక్టోబరు 3 నుంచి 21వతేదీ వరకు టెట్ నిర్వహించి, అనంతరం ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్‌లను విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించారు. తదుపరి అక్టోబరు 29న తుది కీ విడుదల చేసి తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలను ఏపీ టెట్ రిజల్ట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మరో రెండు రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో టెట్ ఫలితాలపై అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. టెట్‌లో అర్హత సాధించిన వారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు టెట్ అర్హత సర్టిఫికెట్ ఏడేళ్లు మాత్రమే చెల్లుబాటయ్యేది. 2022లో దీన్ని జీవితకాలానికి మార్పు చేశారు. దీంతో గతంలో టెట్‌లో అర్హత సాధించినా మార్కుల్లో మరింత మెరుగు కోసం ఈ ఏడాది టెట్‌కు చాలామంది హాజరయ్యారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఉండడంతో అభ్యర్థులంతా దీనిపై దృష్టి సారించారు. టెట్‌కు జిల్లాలో 9,350 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 7,500 మంది అభ్యర్థులు హాజరుకాగా సోమవారం విడుదలైన ఈ ఫలితాల్లో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

11వ తేదీ వరకు గడువు

- వివరాలు 6లో..



సీతారామపురం : భైరవకోనలో ప్రత్యేక అలంకరణలో పరమ శివుడు, త్రిముఖ దుర్గాదేవి





కావలి : పాతూరు శివాలయంలో బారులు తీరిన భక్తులు



నెల్లూరులో దీపారాధన చేస్తున్న భక్తులు

వైభవంగా కార్తీక సోమవారం

● శివనామస్మరణలతో మారుమోగిన శివాలయాలు

జిల్లావ్యాప్తంగా శివకేశవ ఆలయాల్లో కార్తీక సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే పాలభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. శివనామస్మరణలతో ఆలయాలు మారుమోగిపోయాయి. సాయంత్రం కార్తీక దీపారాధనలు స్వామివార్లకు ప్రాకారోత్సవాలు జరిగాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో తొలి సోమవారం వేడుకలు కనుల పండువగా జరిగాయి. భారీ సంఖ్యలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు పూలంగిసేవలు జరిగాయి. రాత్రి ప్రాకారోత్సవం జరిగింది. ఉభయకర్తలు, ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఏం జరుగుతుంది!

(5వ పేజీ తరువాయి)

ప్రధానంగా సీసీరోడ్లు, మరుగు కాలువల నిర్మాణాలకే ప్రాధాన్యం ఇచ్చిన పాలక మండలి గతంలో పూర్తి చేసిన పలు పనులకు ర్యాటిఫికేషన్ అనుమతులు కోరనున్నారు. ధనలక్ష్మీపురంలోని శ్రీనివాస్‌నగర్‌లోని పార్కుకు తమ అల్లుడు పేరును అధికారికంగా పెట్టాలన్న విజ్ఞప్తిని కాటం వేణుగోపాల్‌రెడ్డి కోరగా అందుకు అంగీకరించిన పాలకమండలి శ్రీనివాస్ పార్కుగా పేరు పెట్టేందుకు అజెండాలో చేర్చారు. అలాగే డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌కు వేసిన ఆస్తి పన్నులో రూ.1.57 లక్షల్లో 75 శాతం రాయితీ ఇచ్చేందుకు అజెండాలో చేర్చారు. ఎన్ఎంసీలోని హౌసింగ్ విభాగంలో సలహాదారుడిగా కే మధుసూదన్‌ను కొనసాగించేందుకు తీర్మానం పెట్టారు.

● విగ్రహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నగరంలోని వివిధ కూడళ్లలో పలువురి విగ్రహాల ఏర్పాటుకు నేటి కౌన్సిల్లో అనుమతి కోరుతూ పాలక మండలి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందులో ముత్తుకూరు కూడలి వద్ద ఆనం వెంకటరెడ్డి, మినీ బైపాస్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గౌతమ బుద్ధుడు, గాంధీ బొమ్మ కూడలి వద్ద రావు సాహెబ్ పండిత గానాల రామమూర్తి, నర్తకి కూడలిలో నటుడు కృష్ణ, లీలామహల్ సెంటర్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాల ఏర్పాటుకు అజెండాలో చేర్చారు. రామలింగాపురంలోని మున్సిపల్ పాఠశాలకు శ్రీకంఠం మీనాక్షమ్మ పేరు పెట్టాలని కోరుతూ అజెండాలో పొందుపరిచారు. నగరంలోని 7 కూడళ్ల వద్ద రూ.1.40 కోట్లతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోనున్నారు. 2,268 మంది ఉద్యోగులను ఏడాదిపాటు కొనసాగిస్తూ వీరికి రూ. 42.51 కోట్లు జీతాల రూపేణా చెల్లించేందుకు అజెండా తయారు చేశారు. 6వ డివిజన్‌లో వివాదాస్పద స్థలంగా మారిన 112 సర్వేనెంబరులో వాటర్‌ప్లాంటు నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తూ అజెండాలో చేర్చడం గమనార్హం. అలాగే వివిధ విభాగాలలో మరణించిన ఉద్యోగుల వారసులకు 112 మందికి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నేడు జాబ్ మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ కావలిలోనూ, జిల్లా ఉపాధి కార్యాలయంలోనూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తిచేసిన యువతీ యువకులు అర్హులన్నారు. వయసు 18 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తికలవారు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కలువాయి, నవంబరు 4: స్థానిక ఓ యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సుమన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన గోవిందు నిస్సి (16) అనే యువతి ఆదివారం రాత్రి నుంచి కనిపించడం లేదని తల్లి దీవెనకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సోమవారం నిస్సి తీసుకెళ్లిన స్కూటీ ఉయ్యాలపల్లి సమీపంలోని తెలుగుగంగ కాలువ గట్టున ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. అక్కడ ఆమె కనిపించకపోవడంతో కాలువలో గల్లంతై ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, నిస్సి కలువాయిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది.

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా : డీఈ

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చునని విద్యుత్ శాఖ డీఈ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి సోలార్ ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ రూ.1000 కరెంటు బిల్లు వచ్చే ఇంటికి సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే రూ.350 వస్తుందన్నారు. కిలో వాట్‌కు రూ. 70 వేలు అవుతుందని, అందులో ప్రభుత్వం రూ.30వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏఈ పవన్‌కుమార్, ఎల్ఐ రాజశేఖర్, లైన్‌మెన్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ పంటలతోపాటు ఆధునిక పంటల సాగుపై అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. సాగుదారులకు లాభాలు, ప్రజలకు ఆరోగ్యాన్ని తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ సాగు జిల్లాలో పెరుగుతోంది. పొదలకూరు మండలం వనంతోపు సమీపంలో దుగ్గిరాల వెంకటేశ్వర్లు తన మూడెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. మొదటి మూడేళ్లు పెట్టుబడిపోను ఆ తర్వాత ఇరవై ఐదేళ్లపాటు లాభాలు అందుకోవచ్చని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)

డ్రాగన్ పండు.. లాభాలు మెండు!

● జిల్లాలో పెరుగుతున్న సాగు ● ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులకు సబ్సిడీ

● ఉద్యాన శాఖ కూడా ఆర్థిక తోడ్పాటు ● 3 ఎకరాల్లో సాగు చేపట్టిన పొదలకూరు రైతు

డ్రాగన్ ఫ్రూట్స్ రెండు రకాలు. ఒకటి తెలుపు, మరొకటి గులాబీ రంగులో ఉంటుంది. తెలుపు రంగులో ఉన్నవి కాస్త పుల్లగాను, గులాబీ రంగులో ఉన్న పండు మంచి రుచిగానూ ఉంటుంది. ఇది కేన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అనేక రకాల విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫైబర్ తదితర మేలు చేసే గుణాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 100 కేలరీల శక్తిని అందిస్తుందని, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఈ పంట సాగుకు ఉద్యాన శాఖ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సబ్సిడీతోపాటు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

● పంట వేసే విధానం..

డ్రాగన్ ఫ్రూట్ మొక్క ధర రూ.50 నుంచి 70 వరకు ఉంటుంది. సిమెంటు దిమ్మెలు, డ్రిప్ సాయంతో పంటను సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి అధికంగా వస్తుంది. ఒక్కసారి మొక్క నాటితే దాదాపు 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది. ఏడడుగుల సిమెంటు దిమ్మె చుట్టూ నాలుగు మొక్కలను నాటవచ్చు. మరో దిమ్మెకు మధ్య 9 అడుగుల దూరం ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ చెట్టును దిమ్మె చుట్టూ అల్లి కిందకు జారకుండా దారంతో కట్టాలి. ఇది ఏడాదిలో మూడుసార్లు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. తక్కువ నీటి వినియోగంతోపాటు చీడపీడల ప్రభావమూ తక్కువగానే ఉటుంది. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి పెట్టాలి. ఆ తర్వాత సంవత్సరం నుంచి పెట్టుబడి లేకుండా పంట సాగు చేయవచ్చు. 500 దిమ్మెలకు 2వేల మొక్కలు నాటే అవకాశం ఉంది. పంట పెట్టుబడికి ఎకరాకు రూ.5 లక్షల నుంచి 6లక్షల వరకు ఖర్చు అవుతుంది. మొక్కలకు నాలుగు రోజులకొకసారి నీరు పట్టాలి. నీరు ఎక్కువగా పడితే మొక్కలు త్వరగా పాడవుతాయి. డ్రాగన్ ఫ్రూట్ మొగ్గగా మారినప్పటి నుంచి పండుగా మారాలంటే 45 రోజుల సమయం పడుతుంది.

● డ్రాగన్ ఫ్రూట్స్‌తో ఆదాయం..

డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం కిలో ధర రూ.100 నుంచి 140 వరకు ఉంది. పంటను కోసిన తర్వాత 2 నెలల వరకు పండు పాడవకుండా నిల్వ చేసుకోవచ్చు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కను సైతం విత్తనంగా మార్చి మరో మొక్కను తయారు చేయవచ్చు. పొలంలో తక్కువ స్థలంలో నర్సరీగా మార్చి సీడ్స్ పెంచవచ్చు. దాంతో ఇతరులకు నారు అమ్మి ఆదాయం పొందవచ్చు. లేదా మరో ఎకరా పొలంలో నాటి పంటను సైతం తక్కువ పెట్టుబడితో సాగు చేసే అవకాశం ఉంటుంది. ఉద్యాన శాఖ అధికారులు సైతం పంట సాగుకు విడతల వారీగా నగదు మంజూరు చేస్తారు. పంట వేసిన మూడేళ్ల తర్వాత నుంచి లాభాలు ఆర్జించవచ్చు.



వనంతోపు సమీపంలోని డ్రాగన్ ఫ్రూట్స్ తోట

రైతులకు ఎంతో ఉపయోగం

సన్న, చిన్నకారు రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.1.86 లక్షల వరకు సబ్సిడీ ఉంటుంది. ఉద్యాన శాఖ తరఫున మరో 50వేలు సాగు తోడ్పాటు అందిస్తున్నాం. పంటకు పనికిరాని, బీడు భూమిలో సైతం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసుకోవచ్చు. ఎక్కువ నీరు అవసరం లేకుండా తక్కువ నీటితో సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి అధికమవుతుంది. జాబ్‌కార్డులు కలిగిన రైతులకు అవకాశం ఉంది. చిన్నపాటి మెలకువలతోపాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు.

- ఈ.ఆనంద్, ఉద్యాన అధికారి, పొదలకూరు

రూ.6 లక్షల వరకు ఆదాయం



మూడు ఎకరాల్లో రెండు వేల మొక్కలు నాటాను. ఎకరాకు దాదాపు రూ.5లక్షల నుంచి 6లక్షల వరకు ఖర్చు అయింది. గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. డ్రిప్ సాయంతో మొక్కలకు నీరు అందిస్తున్నా. ఏడాదికి 6 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. దీంతో రూ.6లక్షల 7లక్షల వరకు ఆదాయం పొందుతున్నాం. అలాగే డ్రాగన్ ఫ్రూట్ నారు కూడా మేమే అమ్ముతున్నాం. కావాల్సిన వారు 94409 77389, 9493650206 నెంబర్లను సంప్రదించగలరు.

- జి.వెంకటేశ్వర్లు, రైతు, మర్రిపల్లి

హోరాహోరీగా రాష్ట్ర హాకీ పోటీలు

● సెమీస్‌కు చేరిన నెల్లూరు జట్టు



పోటీలో తలపడుతున్న చిత్తూరు, విశాఖపట్నం బాలుర జట్లు

నెల్లూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని సౌత్‌మోపూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హాకీ పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్ల మ్యాచ్‌లో పశ్చిమగోదావరి 3-0 గోల్స్‌తో, అనంతపురం, కర్నూలు పోటీల్లో అనంతపురం 4-0 గోల్స్‌తో, కడప, కృష్ణా పోటీల్లో కడప 7-0గోల్స్‌తో, ప్రకాశం, నెల్లూరు పోటీల్లో ప్రకాశం 2-0 గోల్స్‌తో, పశ్చిమగోదావరి, విజయనగరం పోటీల్లో పశ్చిమగోదావరి 1-0గోల్స్‌తో, అనంతపురం, తూర్పుగోదావరి పోటీల్లో అనంతపురం 4-0గోల్స్‌తో, కడప, శ్రీకాకుళం జట్ల పోటీల్లో కడప 8-0గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అలాగే బాలుర విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు పోటీల్లో శ్రీకాకుళం 3-0 గోల్స్‌తో, నెల్లూరు, తూర్పుగోదావరి పోటీల్లో నెల్లూరు 1-0 గోల్స్‌తో, అనంతపురం, విజయనగరం పోటీల్లో అనంతపురం 6-0గోల్స్‌తో, విశాఖ, కర్నూలు పోటీల్లో విశాఖ 7-0గోల్స్‌తో, కడప, పశ్చిమగోదావరి పోటీల్లో కడప 3-0గోల్స్‌తో, తూర్పుగోదావరి, చిత్తూరు పోటీల్లో తూర్పుగోదావరి 3-2 గోల్స్‌తో, శ్రీకాకుళం, తూర్పుగోదావరి పోటీల్లో 0-5 గోల్స్ తేడాతో శ్రీకాకుళం, అనంతపురం, కృష్ణా పోటీల్లో అనంతపురం 5-0 గోల్స్‌తో, విశాక, ప్రకాశం పోటీల్లో విశాఖ 3-0 గోల్స్‌తో, కడప, గుంటూరు పోటీల్లో కడప 2-0గోల్స్‌తో విజయం సాధించాయి. దీంతో తొలిరౌండ్, క్వార్టర్ ఫైనల్స్ పూర్తయ్యేసరికి బాలికల విభాగంలో పశ్చిమగోదావరి-కడప జట్లు, అనంతపురం-విశాఖపట్నం జట్లు సెమీ ఫైనల్స్‌లకు చేరుకున్నాయి. అలాగే బాలుర విభాగంలో కడప-నెల్లూరు జట్లు, చిత్తూరు-పశ్చిమగోదావరి జట్లు సెమీస్‌కు చేరకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండోరోజు పోటీలను భారత జూనియర్ క్రీడాకారిణి ప్రసన్నలక్ష్మి, జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎన్. విజయ, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకులు పీ థామస్‌పీటర్, జీడీ .సురేష్‌బాబు, పీఈటీలు పర్యవేక్షించారు.

బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4: బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్టర్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు,వీధిబాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి బీజేకే కాశిందొర ఒక ప్రకటనలో తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలన్నీ బాలల రక్షణ, సంరక్షణ చట్టం 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొనేవారు నిర్దేశించిన దరఖాస్తుతోపాటు సంబంధిత పత్రాలు జత చేసి ఈ నెల 11వ తేదీలోగా తమ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్టు ద్వారా కాని, రిజిస్టర్ పోస్టు ద్వారా కాని పంపాలన్నారు. వివరాలకు 91000 45421 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఐఏబీ సమావేశం నిర్వహించాలని జేసీకి వినతి



జేసీకి వినతిపత్రం అందచేస్తున్న రాధాకృష్ణమనాయుడు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐఏబీ సమావేశం నిర్వహించి మొదటి పంటకు సాగునీరందించాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు జేసీ కార్తీక్‌కు సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందచేశారు. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో 120 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. దీంతో మొదటి పంటకు ప్రతి ఎకరాకు నీరందించే అవకాశం ఏర్పడిందన్నారు. ఐఏబీ సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలు

● సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు ● పోర్టు పరిధిలోకి చేర్చాలని బీసీ కాలనీవాసులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షుడు పెంచల నరసయ్య, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌లు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు ఓబులేసు, హనుమంతు, పెంచలయ్య, బాష, వెంకటేష్, కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

● పోర్టు పరిధిలోకి చేర్చాలి..

రామాయపట్నం పోర్టు పరిధి లోకి సాలిపేట బీసీ కాలనీని చేర్చి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని కోరుతూ పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం నాయకులు, సాలిపేట గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యానికి లాభాలు తెచ్చి పెడుతూ, పోర్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు పోర్టు మొండి చేయి చూపిస్తున్నదన్నారు. సాలిపేట బీసీ కాల నీని సర్వేచేసి పరిహారం ఇవ్వకుండా వదిలేయటం సరైన పద్ధతి కాదన్నారు. ధర్నాలో సీఐటీ యూ జిల్లా కార్యదర్శులు గోగుల శ్రీనివాసులు, అల్లాడి గోపాలు, కోలగట్ల సురేష్, జీ వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సాలిపేట గ్రామస్థులు

● బాధితురాలికి న్యాయం చేయాలి

అనంతసాగరం మండలం కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థినిని మోసం చేసి, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకుడైన హసన్‌ను కఠినంగా శిక్షించాలని కలెక్టర్ ఆనంద్‌కు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ వినతిపత్రం సమర్పించారు. విచారణ జరిపి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టరును కలిసిన వారిలో పందిటి సుబ్బయ్య, నాయకులు దీపోగు బాబు, కప్పలదాసు, మంచు కామయ్య, పలిగల చిన్నయ్య, మధు తదితరులు ఉన్నారు.

వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిపించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బధిరులకు, అంధులకు సోమవారం తిక్కన భవన్‌లో కలెక్టర్ ఆనంద్ ల్యాప్‌టాప్‌లను, మొబైల్ ఫోన్లను సోమవారం అందచేశారు. రూ.3.95 లక్షల విలువైన 10 మొబైల్ ఫోన్లు, 7 ల్యాప్‌టాప్‌లను విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో వారికి ఆయన అంద చేశారు.

పింఛన్ ఇవ్వండి మహాప్రభో...!

● వృద్ధ దంపతుల వేడుకోలు



నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి): వీరిద్దరూ భార్యాభర్తలు.. మూడేళ్లుగా భార్య కేన్సర్‌తో బాధపడుతోంది. వృద్ధాప్యంతో భర్త ఇబ్బంది పడుతున్నాడు. వారు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని పింఛన్ కోసం కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు మూలపేటకు చెందిన అంచూరి ఆనందరావు, శేషమ్మ దంపతులు. ఆనందరావుకు వయసు 61 ఏళ్లు. అతడి వయసు ఆధార్‌లో తప్పుగా పడటంతో పెన్షన్ అందలేదు. శేషమ్మ మూడేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్నా, ఆమెను కూడా అధికారులు కనికరించలేదు. పింఛన్ కోసం మూడేళ్ల నుంచి వారు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఇకనైనా వారికి పెన్షన్ ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

ఎన్నాళ్లిలా..


తహసీల్దార్ కార్యాలయంపై ప్లాస్టిక్ పట్టలు కప్పుతున్న సిబ్బంది

విపత్కర పరిస్థితుల్లో ప్రజలను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు వర్షం వస్తే వారికే రక్షణ ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి కావలి తహసీల్దార్ కార్యాలయంలో ఉంది. కార్యాలయం భవనం శిథిలావస్థలకు చేరడంతో కొద్దిపాటి వర్షానికే ఉరుస్తుంది. ఈ సమస్యతో సోమవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తమ కార్యాలయంలో రికార్డులు తడవకుండా కాపాడుకునేందుకు ముందస్తుగా ప్లాస్టిక్ పట్టలు తెచ్చి కూలీలతో కప్పించారు. ముందు తమ భవనం కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన వస్తుందని కార్యాలయంలో పనిచేసే అధికారులు వాపోతున్న పరిస్థితి ఉంది.

-కావలి (ఆంధ్రజ్యోతి)

భక్తుల కిటకిట


ప్రత్యేక అలంకారంలో సిద్ధులు

మండలంలోని సిద్దలకోన తిరునాళ్ల సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. నవకోటి సిద్దేశ్వర, నవనాథసిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షణామూర్తి స్వామివారికి విశేష పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కోన ఆవరణలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- సైదాపురం (ఆంధ్రజ్యోతి)

అసలే ఇరుకు రోడ్డు ఆపై పార్కింగా!?

కావలి నడిబొడ్డున ఉన్న ఆర్వోబీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. దక్షిణం వైపు ఉన్న మెకానిక్ షాపుల నిర్వాహకులు ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే ఉంచు తున్నారు. ఉత్తరం వైపు రోడ్డులో మంచినీటి పైపులైన్లు ఉండటం తో అవి లీకేజీ అయి నపుడల్లా రోడ్డు పగులగొట్టి గుంతలమ యంగా మారింది. రోడ్ల ఆక్రమ ణకు గురైనా పో లీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి రోడ్ల ఆక్రమణకు గురవకుండా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)


ఆర్వోబీ వంతెన రోడ్డుపై పార్కుచేసిన ద్విచక్రవాహనాలు

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు వెంగళరావునగర్‌లో జరగ్గా, సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు, వెంగళరావునగర్‌కు చెందిన అమీర్ (35), షబానా దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. అమీర్ కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అందులో పెద్దగా సంపాదన లేకపోవడంతో రెండు నెలల కిందట ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని నడుపుతున్నాడు. కుమార్తెకు పెళ్లి సంబంధాలు వస్తుండడంతో వివాహం చేసేందుకు డబ్బులు లేక లోలోన బాధపడేవాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేకపోతున్నానని, చనిపోతానని భార్యతో అంటుండేవాడు. ఆమె సర్ది చెబుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 3వతేదీ సాయంత్రం రామకోటయ్య నగర్‌లోని బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండడంతో భార్యా పిల్లలను ఆటోలో అక్కడ వదిలి పెట్టాడు. రాత్రి 9.30 గంటలకు వస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లాడు. నేరుగా తన ఇంటికి చేరుకొని ఇంట్లోని ఇనుప పైపునకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 10 గంటలు అవుతున్నా అమీర్ రాకపోవడంతో భార్యాపిల్లలు ఇంటికి వెళ్లి చూడగా చున్నీకి వేలాడుతూ కనిపించాడు. పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకొని అమీర్‌ను కిందకు దించి జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అమీర్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో భార్య సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కదిరి బాలికలు.. మనుబోలులో ప్రత్యక్షం

● బాలసదన్‌కు తరలించిన అధికారులు

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై అలిగి వచ్చేసిన ఇద్దరు బాలికలకు నెల్లూరు జిల్లా మనుబోలు తిరుగుతుండగా ఆదివారం రాత్రి స్థానికులు గుర్తించారు. ఆరిని ఎస్‌ఐ రాకేష్ నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రుల వేధింపులు తాళలేక, వారి ఆలనాపాలనా లేకపోవడంతో ఇంట్లో నుంచి శుక్రవారం పారిపోయి వచ్చేశారు. గూడూరు వెళుతున్న రైలు ఎక్కి మనుబోలు వద్ద దిగారు. రాత్రి పది గంటల సమయంలో మనుబోలులో దసరా చావడి వద్ద తిరుగుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ స్పందించి బాలికల నుంచి సమాచారం సేకరించారు. రోదిస్తున్న వారికి భోజనం పెట్టించి నెల్లూరులోని బాలసదన్‌కు తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు రాగానే బాలికలను అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పెన్నా నదిలో మునిగి వ్యక్తి మృతి


వెంకయ్య మృతదేహాన్ని వెలికితీసిన స్థానికులు

పొదలకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో పెన్నా నదిలో దిగి నీట మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని సూరాయపాలెం వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూరాయపాలెం గిరిజన కాలనీకి చెందిన ఆదిపూడి వెంకయ్య (45) మద్యం మత్తులో ఈత కొట్టేందుకు సమీపంలోని పెన్నా నదిలో దిగి నీట మునిగి మృతి చెందినట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు : ఒకరి అరెస్టు

ఉదయగిరి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పాలకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ పోస్ట్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరు పట్టణానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ పెసల శివశంకర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పాలకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ పెట్టిన పోస్టులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అందిన ఫిర్యాదు మేరకు అతన్ని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోరిక తీరిస్తే డెత్ సర్టిఫికెట్ ఇస్తా!

● గిరిజన మహిళపై లైంగిక వేధింపులు

● పంచాయతీ కార్యదర్శిపై ఎస్పీకి ఫిర్యాదు ● పోలీసుల విచారణ

రాపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరిన గిరిజన మహిళకు పంచాయతీ కార్యదర్శి నుంచి రెండేళ్లుగా వేధింపులు మొదలయ్యాయి. తన కోరిక తీరిస్తే ఐదు నిమిషాల్లో సర్టిఫికెట్ ఇస్తానని చెప్పడంతో బాధిత మహిళ ఎస్పీని ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. రాపూరు మండలం కోటురుపాడు గిరిజన కాలనీకి చెందిన మల్లిక నాగలక్ష్మి తండ్రి శంకరయ్య 1993లో మృతి చెందాడు. ఈయన మృతిపై అప్పట్లో పంచాయతీ రికార్డులలో నమోదు చేయలేదు. దీంతో తన తండ్రి డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని నాగలక్ష్మి పంచాయతీ కార్యదర్శి చెంచయ్యను కోరింది. అయితే, సర్టిఫికెట్ కావాలంటే తన కోరిక తీర్చాలంటూ కార్యదర్శి వేధించినట్లు నాగలక్ష్మి వాపోయింది. వీడియో కాల్ చేసి నగ్నంగా చూపించాలని, గూడూరులో తనకు ఇల్లు ఉందని అక్కడకు వస్తే ఐదు నిమిషాల్లో సర్టిఫికెట్ ఇస్తానని చెప్పడంతో విసుగు చెందిన బాధిత మహిళ సోమవారం నెల్లూరులోని ఎస్పీ కృష్ణకాంత్‌ని కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు రాపూరు సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా విచారించి న్యాయం చేస్తామని సీఐ చెప్పారని బాధిత మహిళ పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఆర్‌పీఎస్ నాయకుడు కీచక పంచాయతీ సెక్రటరీ కఠిన శిక్ష వేయాలని కోరారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: మూత్ర విసర్జన కోసం రోడ్డుపక్కన నిల్చున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి భీమవరం వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భీమవరం గ్రామానికి చెందిన రసూల్ (40) తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఆత్మకూరు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ మూత్ర విసర్జన కోసం తన టీవీఎస్ వాహనాన్ని ఆపి రోడ్డు పక్కన నిలబడి ఉండగా భీమవరం వైపు వెళ్తున్న బైక్ అతనిని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టిన వ్యక్తి 108కి సమాచారం ఇచ్చి తన బైక్‌ను వదిలి పారిపోయాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో మృతి చెందిన రసూల్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7591
వెండి కిలో ధర	రూ. 97,400
వెండి ఒక గ్రాము	రూ.100.40

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యం.. ఆహ్లాదం

● మెరుగైన వసతుల కల్పనకు 'సక్షం' ● కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్‌ల పెంపకం

● తొలివిడతగా 401 అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక


సక్షం పథకానికి ఎంపికైన నందిపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం

ఉదయగిరి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్లలోపు పిల్లలు, గర్భవతులు, బాలింతలకు సమగ్ర పోషణ, ఆరోగ్యంపై అవగాహన, కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఇందుకు తగిన వసతులు, సౌకర్యాలు లేక కేంద్రాలు కునారిల్లుతున్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మెరుగైన వసతులు కల్పనే లక్ష్యంగా కేంద్రాల్లో సక్షం (స్టిమ్యులేటింగ్ అడ్వాన్సుడ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 401 అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం కార్యక్రమానికి ఎంపికయ్యాయి.

● **పోషకాహారం, శుద్ధిజలం**

జిల్లాలో ఎంపికైన 401 అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేస్తారు. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. వాటిని పిల్లలు, గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. రక్షిత మంచినీటిని అందించేందుకు శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణ బాధ్యతలను ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అప్పగించారు. ఇప్పటికే సంబంధిత సీడీపీవోలు కేంద్రాలను సందర్శించి అందుకు తగ్గ చర్యలు చేపట్టడంతోపాటు పండ్లు, పూలు, ఆకుకూరల మొక్కలు పంపిణీ చేస్తున్నారు.

● **సమకూరనున్న సదుపాయాలు**

తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొనేందుకు చర్యలు చేపడతారు. విద్యాబోధన మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకొంటారు. పరిజ్ఞానం పెంపొందించేందుకు కేంద్రంలో వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు ఏర్పాటు చేస్తారు. బల్లలు, కుర్చీలు, ఫర్నీచర్ అందుబాటులోకి తీసుకొస్తారు. చిన్నారులు ఆకట్టుకునే విధంగా బోధనకు దృశ్య, శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు సమకూరుస్తారు. వీటన్నింటికిగాను ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాల తోటకు రూ.10వేలు, ఇంకుడుగుంతకు రూ.16వేలు, ఇతర వసతుల కల్పనకు రూ.19,800 నిధులు కేటాయించారు.


401 కేంద్రాల ఎంపిక

జిల్లాలో 401 అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం పథకం కింద ఎంపికయ్యాయి. వీటిలో న్యూట్రిగార్డెన్స్, ఇంకుడుగుంతలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తాం.

- హేనాసుజన్, ఐసీడీఎస్ పీడీ

నిండుకుండలా సోమశిల, కండలేరు

● మొదటి పంటకు నీటి కొరత తీరినట్టే


వరద జలాలతో నిండుకుండలా సోమశిల

అనంతసాగరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతం నుంచి సమృద్ధిగా వరద రావడంతో జిల్లాలో ప్రధాన జలాశయాలైన సోమశిల, కండలేరు నిండుకుండను తలపిస్తున్నాయి. సంగం, నెల్లూరు బ్యారేజీలలోనూ నీరు ఉండటంతో జిల్లావ్యాప్తంగా నీటి ఇబ్బందులు తొలగిపోయాయి. చెరువులు, బావుల్లోనూ నీటి లభ్యత కలగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇక నీటి కేటాయింపులతో ప్రమేయం లేకుండా డెల్టా, నాన్‌డెల్టా పరిధిలో వరి సాగుకు సమాయత్తం అవుతున్నారు. సోమశిల డ్యాంకు ఆగస్టు 3 నుంచి కృష్ణా జలాలు రాక ఆ తర్వాత పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో పుష్కలంగా వర్షాలు కురిసి వరద పోటెత్తడంతో డ్యాం నిండుకుండలా మారింది. సోమశిలకు ప్రస్తుతం 13,129 క్యూసెక్కుల వరద వస్తుండగా, 70.432 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తరకాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. మరోవైపు వచ్చే వరదను ప్రణాళికగా తెలుగుగంగ కాలువ ద్వారా కండలేరుకు తరలించడంలో ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. డెడ్‌స్టోరేజీలో ఉన్న కండలేరు నీటిమట్టం నేడు 47 టీఎంసీలకు చేరుకుంది. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా అధికార, అనధికారికంగా 6 నుంచి 7లక్షల ఎకరాల్లో మొదటిపంట వరి సాగు చేసే పరిస్థితి కనిపిస్తోంది. సోమశిల పరిధిలో ఉత్తర, దక్షిణ, కాలువలతోపాటు కావలి, కనుపూరు కాలువలకూ నీరు అందించేలా చర్యలు చేపట్టారు. గడిచిన ఏడాది నుంచి వరికి ఆశాజనకంగా ధర లభిస్తుండగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

● **ఎరువులు, విత్తనాల కోసం..**

జిల్లాలో ఖరీఫ్ సాగు మొదలవగా ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రైవేటు దుకాణాల దరల్లో వ్యత్యాసం ఉండటంతో రైతులు సబ్సిడీల ద్వారా లభించే ఉత్పత్తుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ రైతు సేవా కేంద్రాల్లో అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, యూరియా, డీఏపీ ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో అల్లూరు యువకుల ప్రతిభ

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రస్థాయిలో కైకలూరులో నిర్వహించిన చెడుగుడు పోటీల్లో అల్లూరు యువకులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ నెల 2న నిర్వహించిన టోర్నమెంటులో మొత్తం 50 టీములు పోటీలో ఉండగా అందులో సుమంత్ ఫ్రెండ్స్ అల్లూరు జైభీమ్ టీమ్ పాల్గొని ప్రతిభచూపి ద్వితీయస్థానంలో నిలిచారు. నెల్లూరు జిల్లా నుంచి మూడు టీములు పాల్గొనగా మొదటి బహుమతిని విడవలూరు మండలం ముదివర్తికి చెందిన యువకులు, రెండో బహుమతిని అల్లూరు యువకులు, అదేవిధంగా ఐదో బహుమతిని కోవూరుకు చెందిన యువకులు కైవశం చేసుకున్నారు. అల్లూరు యువకుల్లో నరహరి బెస్ట్ రైడ్ రాప్ ప్రోత్సాహాన్ని పొందడం గమనార్హం. ఈ మేరకు స్థానికులు వీరిని అభినందించారు.

పెన్షనర్లు సంఘాల్లో చేరాలి : విఠపు


మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పెన్షనర్ సంఘాల్లో చేరాలని, అలా చేరితే సంఘాలు బలపడతాయని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రమ్మణ్యం తెలిపారు. సోమవారం నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవనంలో రాష్ట్ర పెన్షనర్ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల కోసం కార్యాచరణ ప్రణాళికను వివరించారు. సమావేశానికి సంఘం అధ్యక్షుడు గౌస్‌బాషా అధ్యక్షత వహించారు. పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకుపోతామన్నారు. అనంతరం డాక్టర్ అగర్వాల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరిగింది. పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు యూనియన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు ఏ.రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీపీఎస్ మూర్తి, ఉపాధ్యాయ ఉద్యమనేత బాబిరెడ్డి, కోశాధికారి జే హజరతయ్య, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● వీఎస్‌యూ వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డేటా విశ్లేషణ నైపుణ్యాలను పెంపొందించుకోడం వల్ల పరిశోధనలో మెరుగైన ఫలితాలను సాధించగలరని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో సోమవారం వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌పీఎస్ఎస్ ఉపయోగించే డేటా విశ్లేషణ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాటాడుతూ ఆధునిక డేటా విశ్లేషణ పద్ధతులను నేర్చుకోవడంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డాక్టర్ సీహెచ్ రాజ్ కమల్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, విభాగాధిపతి డాక్టర్ జీ సాయిస్రవంతి, డాక్టర్ సీ చెంచురెడ్డి, డాక్టర్ జే విజేత, డాక్టర్ వై విజయ, డాక్టర్ ఆర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం ముమ్మరం చేస్తాం

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేసేందుకు ప్రతి మాల సోదరుడు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని జాతీయ మాలల అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. సోమవారం అల్లూరులో నిర్వహించిన మాలల మహాగర్జన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదన్నారు. కార్యక్రమంలో జాతీయ పీపుల్స్ పార్టీ అంబాటి కొండలరావు, కంటేపల్లి సింహాద్రి, ఎల్లు సాల్మన్‌రాజు, మునలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్ తదితరుల పాల్గొన్నారు.

కృష్ణపట్నం తోళ్ల పరిశ్రమను వెంటనే ప్రారంభించాలి

దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కృష్ణపట్నం అంతర్జాతీయ తోళ్ల పరిశ్రమలను వెంటనే ప్రారంభించాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 15 వేల మంది చర్మకారులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మెగా ఫుట్ వేర్ క్లస్టర్ కింద 2009లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్ విమర్శించారు. రూ. 281.62 కోట్ల అంచనా వ్యయంతో 537 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం ప్రభుత్వం రూ. 125 కోట్లు ఇవ్వడానికి అంగీకరించిందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా భూమి, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉందని సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ గత 15 సంవత్సరాలుగా ముందుకు సాగకపోవడాన్ని బట్టి చూస్తుంటే దళితులు, చర్మకారుల పట్ల ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటనేది బయటపడుతుందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

డిగ్రీ పరీక్షలకు 682 మంది గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షలకు 682 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 8713 మంది విద్యార్థులకు గాను 8031 మంది హాజరయ్యారు.

సమస్యల పరిష్కారం కోసం రైతుల ఆందోళన

ఉదయగిరి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో భూములకు ఆన్‌లైన్‌లో 1బీ, అండగల్ రాకపోవడంతో నోషనల్ ఖాతా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకులు తిరుపతయ్య, వెంకటసుబ్బయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

● భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు ● దీపాలు వెలిగించిన మహిళలు



ఘటిక సిద్దేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి, అలఘునాథస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

● సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. కొందరు మహిళలు పెన్నానది వద్ద స్నానాలు చేసి పెన్నమ్మకు దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా తిరుమనకొండ కాశీవిశ్వేశ్వరాలయం, వంగల్లు భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● ఉదయగిరి రూరల్: గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాలతోపాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే దుత్తలూరు కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

● సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవకోన సొనవాన జలపాతంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించి పరమశివుడు, త్రిముఖ దుర్గాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగ పుష్పాలతో పూజలు చేశారు.

● కావలి టౌన్, అక్టోబరు 4: పాతూరు శివాలయం, వెంగళరావునగర్ శివాలయం, ముసునూరు శివాలయాల్లో భక్తులు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతూరు శివాలయంలో శివ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవలతో ప్రారంభించిన పూజలు వృశ్చిక కాలాభిషేకం, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. నెల రోజుల పాటు నిత్యార్చన, అభిషేకాలు నిర్వహిస్తారని భక్తులు పాల్గొని శివకటాక్షం పొందాలని ప్రధాన అర్చకులు శశిగురుకుల్ తెలిపారు.



ఉదయగిరి, ఆత్మకూరులో శివుడికి అలంకరణ



సంగం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ట్రంకు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఆక్రమణలు

కావలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డులో సోమవారం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికాధికారి వివేక్ నేతృత్వంలో సిబ్బంది ఈ పనులు చేపట్టారు. ముందుగా కావలి తహసీల్దార్ కార్యాలయం నుంచి రూపాయి మిద్దె వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ముందు ఆక్రమణదారులు రోడ్డు వెంబడి రోడ్డులోకి ఆక్రమణలు వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున స్థానిక జాతీయ రహదారి రాజుపాలెం జంక్షన్ వద్ద ఇసుక లోడుతో నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు చూపలేదన్నారు. అనంతరం వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి ఒంగోలు మైన్స్ ఏడీ కారాలయానికి రాత పూర్వక సమాచారం అందజేశామన్నారు.



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్లు

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో విషజ్వరాలపై తగినంత అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ వైద్యఆరోగ్య కార్యకర్తలు సూచించారు. సోమవారం మండలకేంద్రంలో ఇంటింటికి తిరిగి జ్వరాలు, జలుబు, దగ్గు ఉన్న వారిని గుర్తించి వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు. పరిసర ప్రాంతాలు, పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇంటి ఆవరణంలో వాడుకలోలేని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని ఏఎన్ఎంలు తొలగించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా కేసులు నమోదు అవుతున్నాయని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీహెచ్‌వో దివ్యత, ఏఎన్ఎం పద్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్య సిబ్బంది

సాగునీటి విడుదల పరిశీలన

జలదంకి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువకు సీబీఆర్ ఇన్‌ఫాల్ నుండి విడుదల అవుతున్న సాగునీటిని సోమవారం అన్నవరం చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సీబీఆర్) ఇన్‌ఫాల్ వద్ద సోమవారం స్థానిక టీడీపీ నేత పూనూరు రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు తల్లపనేని మధుసూదనరావు, చల్లా హనుమారెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, కొర్రపాటి రామారావు, కొల్లా క్రిష్ణ, స్వర్ణ కొండపనాయుడు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



సోమశిల జలాలను పరిశీలిస్తున్న నేతలు

గ్రామ వ్యవసాయ సహాయకుల జిల్లా కమిటీ ఎంపిక

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లమో గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా జక్కి గణేష్ సాగర్, జిల్లా అధ్యక్షులుగా బత్తుల వెంకట సుబ్బయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీరామ ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా ఎం.గౌస్ లాజం, ఎస్కే.మస్తాన్, సుమంత్, రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేష్, ట్రెజరీగా సుభాషిణీ, జాయింట్ సెక్రటరీ రాణా ప్రతాప్ నాయక్, నవ్యభారతి, మృధులత, అజారుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అబీద్, మహిళా సెక్రటరీ వానిరెడ్డిలతో పాటు 11మంది ఈసీ మెంబర్లు ఉన్నారు.

విద్యుత్ బిల్లుల భారం విముక్తికే పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన

కావలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి కలిగించేందుకే కేంద్రప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ప్రవేశ పెట్టిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని స్పందన ఫంక్షన్‌హాల్‌లో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై వినియోగదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కావలికి అందుబాటులో ఉన్న రామాయపట్నంలో రూ.24 కోట్లతో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడతామన్నారు. సోలార్‌కు ప్రభుత్వం 20శాతం సబ్సిడీ, బ్యాంకులు 80 శాతం రుణాలు ఇస్తున్నందున ప్రతి ఒక్కరూ సోలార్ బిగించుకుని విద్యుత్ భారం నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ, డిప్యూటీ ఈఈ రవికుమార్‌రెడ్డి, పట్టణ ,రూరల్ ఏఈలు వసంతరావు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● జేబీతోనే జీవితానికి

బంగారు బాట: ఎమ్మెల్యే

కావలి టౌన్, అక్టోబరు 4 : నా జీవితానికి బంగారు బాట వేసింది జవహర్ భారతీ కళాశాలే అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. జేబీ పూర్వ విద్యార్థి, పూర్వ అధ్యాపకులైన ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని సోమవారం జేబీ కళాశాలలోని ఎస్ఆర్ శంకరన్ సెమినార్ హాల్‌లో జేబీ యాజమాన్యం, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి పాల్గొన్నారు.

రీసర్వే తప్పులు సరిదిద్దేందుకే గ్రామసభలు

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో చేపట్టిన రీసర్వేలోని తప్పులను సరిదిద్దేందుకే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అహ్మద్‌అమీర్ తెలిపారు. సోమవారం నేకునాంపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో మస్తాన్ రైతులు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్‌ను కలిసిన జనసైనికులు

కావలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను సోమవారం జనసేన జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నెల్లూరు నుంచి విజయవాడ వెళ్తుతుండగా మార్గమధ్యంలో కావలి తుమ్మలపెంట రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆయనను కలిసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గాదంశెట్టి రవి, తోకల వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వరరావు, సాజిత్, జిలానీ, షమ్మీ, జ్యోతి పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

● కమిషనర్‌ను సీపీఎం నేతల వినతి

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అనూషకు సోమవారం సీపీఎం నేతలు ఎస్ఏ గౌస్, టి.వెంకటరావు, ఎస్కే మల్లిక, ఎం. పద్మ, ఎం.రాయుడులు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల వేదికలో ఆమెను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనూష వారితో మాట్లాడారు. తక్షణం తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అలాగే కాలనీలోని ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాఫిర్యాదుల వేదికలో వివిధ సమస్యలపై 9 అర్జీలు వచ్చాయని, సమస్యల పరిష్కారంకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు కమిషనర్ తెలిపారు



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

కందుకూరు, నవంబరు 4: స్థానిక కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి కార్తీక సోమవారం సందర్భంగా పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అందులో నలదలపూరు మాజీసర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ దంపతులు రూ. 1,01,116లు, ఎర్రారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాజారపు మాలకొండయ్య, పావని దంపతులు రూ.1,00,116లను ఇచ్చారు. అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి కేఎస్ వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు ఇస్కాల వెంకటనరసింహ, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి, నరసింగరావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కావలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే ఆయా విత్తన దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి లలిత హెచ్చరించారు. సోమవారం ఆమె కొత్తపల్లిలో రైతులు వేసిన నారు మడులను పరిశీలించారు. వరి విత్తనాలు సరిగా మొలవలేదన్న ఆరోపణల దృష్ట్యా నారుమడులు సందర్శించామన్నారు. అనంతరం పట్టణంలోని ఇందిరా సీడ్స్‌లో కొనుగోలు చేసిన కెఎన్ఎం 1638 వరి విత్తనాలు 70శాతం మాత్రమే మొలకెత్తాయని దీంతో 70బస్తాలు వెనక్కు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. అనంతరం సీడ్స్ దుకాణంలో తనిఖీలు చేసి వరి విత్తనాల శాంపిల్స్ తీసి ల్యాబుకు పంపతామన్నారు.

పొగాకు సాగు నియంత్రించకుంటే కష్టాలే

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న సీజన్‌లో రైతులు పొగాకు సాగుని నియంత్రించుకోకుంటే కష్టాలు, నష్టాలు తప్పవని బోర్డు అధికారులు హెచ్చరించారు. కందుకూరులోని రెండు వేలం కేంద్రాల పరిధిలోని రైతులకు పొగాకు పంట దిగుబడి, అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన కోసం దూబగుంట సమీపంలోని వేలం కేంద్రంలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారులు కిరణ్, చంద్రశేఖర్‌లతో పాటు పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం నుంచి అధికారిణి ఎం.తులసి, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

చిన్నారులు, మహిళల ఆరోగ్య పరిపుష్టే లక్ష్యం

● టీ.అరుణ, ఉలవపాడు సీడీపీవో



ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిశానిర్దేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో గర్భవతులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లోపం అరికట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఉలవపాడు ఐసీడీఎస్ సీడీపీవో టీ.అరుణ తెలిపారు.

?: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

!: ఉలవపాడు ఐసీడీఎస్ సెంటర్ పరిధిలో లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలు ఉండగా, 183 అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

ఈ ముఖాముఖి

?: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉద్దేశం

!: ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ఎస్టీల జనాభా అధికంగా ఉంది. వీరిలో ఎక్కువగా రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భవతులు, పిల్లలు ఉంటారు. వీరికి రాగిపిండి, అటుకులు, వేరుశనగ చిక్కి, ఎండు కర్జూరం, పాలు, 25గుడ్లు ఇస్తుంది.

?: ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అమలవుతుందా.

!: ప్రతినెలా 5వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

అధికారుల తీరు బాధాకరం

జలదంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంచార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి (డీడీఆర్‌సీ) సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి అధికారులు తగిన గౌరవం ఇవ్వకపోవడం బాధాకరం అని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జలదంకి మాజీ వైస్‌ఎంపీపీ తల్లపనేని మధుసూదనరావు, మండల టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డిలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సమావేశానికి వచ్చిన మంత్రులకు బోకేలు ఇచ్చి ఎంపీ వేమిరెడ్డిని విస్మరించడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులదే అన్నారు.

మురుగును తొలగించండి

జలదంకి నవంబర్4 (ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధిలో 150మీటర్లు దూరం రోడ్డు పల్లంగా మారి వర్షపునీరు ఒకటిన్నర అడుగులోతున నిల్వ చేరి మురుగుమయంగా మారిందని ఈ నీటిలో ప్రజలు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నేత రావి మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆయన సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దారు ప్రమీలకు రావి మాల్యాద్రి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చొరవతో సోమవారం గోచిపాతల సంజయ్ బోగోలు పంచాయతీలోని బేతనీపేటలో నూతనంగా ఏడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. అలాగే విద్యుత్ తీగలను సరిచేయించారు. కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ జడరయ్యా ఆధ్వర్యంలో జేఎల్ఎం అఖిల్, స్థానిక టీడీపీ నేతలు ఫిలిప్, వినోద్, ఫెలోమెన్ ఉన్నారు.

ఏడీఈఎన్ తనిఖీలు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని పలు చోట్ల ఏడీఈఎన్ రాజేంద్రప్రసాద్ తనిఖీలు సోమవారం చేశారు. బోగోలు ఎల్సీగేట్ 144 వద్ద రికార్డులను తనిఖీ చేసి గేట్ వద్ద ఉద్యోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే నార్త్ యాడ్‌లోని 150, 149, 148పాయింట్లను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు బిట్రగుంట సెక్షన్ పీడబ్ల్యూఐ కృష్ణన్, సిబ్బంది ఉన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారులకు ఎంఎస్ఎస్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో న్యాయవాది మాదాల మనోజ్‌కుమార్ నూతన వస్త్రాలు, మాలలను అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసంఘం సభ్యులు నలబోతుల మురళీ, చక్కా వెంకటకేశవ తదితరులు పాల్గొన్నారు.

సాలిపేట బీసీ కాలనీని పోర్టు పరిధిలో చేర్చాలి

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలంలోని సాలిపేట బీసీ కాలనీని రామాయపట్నం పోర్టు పరిధిలో చేర్చి పరిహారం అందజేయాలని పోర్టు నిర్వాసితుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు.

కొండముచ్చు హల్‌చల్

కావలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలో సోమవారం సాయంత్రం కొండముచ్చు హల్‌చల్ చేసింది. అడవుల్లో, కొండ ప్రాంతాల్లో చెట్లపై గెంతుతూ కనిపించే కొండముచ్చు అడవి నుండి తప్పిపోయి జన వాసంలో కనిపించింది. స్థానికులు దీనికి పండ్లు, కూరగాయలు ఆహారంగా అందజేశారు.

అక్రమ కట్టడాల తొలగింపు

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోగోలు ఇంబ్రహీంపేట బజార్ల మధ్య ప్రైవేటు దుకాణాల స్థలంలో సోమవారం కొందరు చేపట్టిన నూతన నిర్మాణాలను రైల్వే అధికారులు అడ్డుకుని వాటిని కూల్చివేయించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకున్నట్లు బిట్రగుంట రైల్వే ఐఓడబ్ల్యూ రాజేష్ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ)నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచారివీధి, మధ్యపతివారివీధి, రాయాజీవీధి, ట్రంకురోడ్డు,యడ్లవారివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి, సహకరించాలని కోరారు.

నగరంలో పోలీసుల దాడులు

● అదుపులో ముగ్గురు సెక్స్‌వర్కర్లు

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చుట్టూ వైద్యశాలలు, ప్రతినిత్యం విజయమహాల్ గేటు మీదుగా రాత్రి 8నుంచి 11 గంటల వరకు వేలాదిమంది మహిళలు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఈ ప్రాంతం గతంలో హిజ్రాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండేది. ఇప్పుడు సెక్స్‌వర్కర్లు ఈ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనంగా ప్రచురితమైంది. ఈ క్రమంలో బాలాజీనగర్ సీఐ సాంబశివరావు సోమవారం రాత్రి విజయమహాల్ గేటు చుట్టుపక్కల ప్రాంతంలో ఒక్కసారిగా దాడులు నిర్వహించారు. దీంతో సెక్స్ వర్కర్లు,హిజ్రాలు పరుగులు తీయగా, పోలీసులు ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిరోజు ఈ ప్రాంతంలో పోలీసు నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముగ్గురు సెక్స్ వర్కర్లని అదుపులోకి తీసుకున్నామని, వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

విడవలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీవో నగేష్‌కుమారి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఏవోలకు ఉల్లాస్ కార్యక్రమంపై సోమవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో చెప్పిన విషయాలను పొదుపు మహిళలకు వివరించాలన్నారు. విద్యయొక్క ప్రాధాన్యతను మహిళలకు తెలపాలన్నారు. కనీసం పుస్తకంలో సంతకం, కూడికలను తీసివేతలను నేర్పాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి వీఏవోలదే కీలక పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకమ్మ, సీసీ శివ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన భక్తులు

పొదలకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలకు భక్తులకు పోటెత్తారు. పట్టణంలోని చోళుల కాలం నాటి శివాలయంతోపాటు, సిద్దలకొండ, బిరదవోలు, డేగపూడి, విరువూరు, చెన్నారెడ్డిపల్లి, ప్రభగిరిపట్నం శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. వందలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ముందుగానే దేవాలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

సీఐగా శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు నూతన సీఐగా శివరామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హనీఫ్, స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం!

● పందుల స్వైర విహారం
● వెంటాడుతున్న వ్యాధుల భయం
● పట్టించుకునే నాథుడే కరువు
● ఆందోళనలో ప్రజలు



జొన్నవాడ ఆలయ సమీపంలోని టీటీడీ సత్రం వద్ద చెత్తాచెదారాల్లో సంచరిస్తున్న పందులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అడుగడుగున చెత్తకుప్పలతో పారిశుధ్యం పడకేసింది. కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తోన్న చెత్తాచెదారాల్లో పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం



పెనుబల్లి స్కూలు వద్ద పేరుకుపోయిన చెత్త

వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయేనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి, పంచేడు, కాగులపాడు, కట్టుబడిపాళెం, విలియమ్స్‌పేట తదితర గ్రామాల్లో పలు చోట్ల వాతావరణం చల్లగా ఉండడంతోపాటు అడపాదడపా వర్షం కురుస్తుండడం వలన చెత్తకుప్పలు మురిగి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పెనుబల్లిలో స్కూలు పరిసరాలలో దర్శనమిస్తున్న చెత్తచెదారాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

● జొన్నవాడ ఆలయ పరిసరాలలో...

జొన్నవాడ కామాక్షితాయి ఆలయం పరిసరాలు, భక్తులు బస చేసే సత్రాలు, పెన్నానది తీరం వెంబడి నీళ్లలో నిత్యం పందులు స్వైరవిహార చేస్తూ ఆలయ పరిసరాలను గబ్బుపట్టిస్తున్నాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జొన్నవాడ ఆలయానికి వచ్చే వేలాది భక్తులు ముందుగా పవిత్ర పెన్నానదిలో స్నానాలు చేస్తారు. ఆ నీటిలో పందుల సంచారంతో దుర్గంధం వెదజల్లుతుండగా అక్కడ పందులను చూసి నీటిలో దిగడానికే భయాందోళన చెందుతున్నారు. బుచ్చి నుంచి సుమారు 200లకు పైగా పందులను తెచ్చి ఆలయ సమీపంలోని బ్రిడ్జి వద్ద పెన్నానదిలో వదిలిపెట్టి హోటళ్లలో వ్యర్థాలను తెచ్చి ఆ పందులకు వేసి పెంచుతున్నారు. దీంతో ఆలయ పరిసరాలలో పెన్నాతీరం కంపుకొడుతోంది. పందుల పెంపకందారుల నుంచి పలువురు స్థానిక నాయకులు డబ్బులు తీసుకుని వారికి మద్దతుగా ఉన్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్యం మెరుగుకు, వ్యాధుల నిర్మూలనకు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీహరిని వివరణ కోరగా 15వ ఆర్థిక సంఘం నిధులతో త్వరలో పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలపై నిరంతర పర్యవేక్షణ

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో లక్ష్మీదేవి



నెల్లూరురూరల్, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పిల్లలు, తల్లులకు అందచేస్తున్నామని, సెంటర్లలోని లోపాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో కే లక్ష్మీదేవి తెలిపారు.

? : అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు

! : ఇలాంటి ఫిర్యాదులపై సీరియస్‌గా ఉన్నాం. ఎక్కడ అన్నది స్పష్టంగా చెబితే వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

? : చాలా చోట్ల భవనాలు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారు

! : అవును.. నూతన భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అవి పూర్తయితే అన్నీ చోట్లా భవనాలు అందుబాటులోకి వస్తాయి. అప్పటి వరకు ఇబ్బందులు తప్పవు.

? : టీచర్లు, ఆయాల ఖాళీలతో ఇన్‌చార్జిలే దిక్కయ్యారు.

! : ఖాళీలు భర్తీ చేసేందుకు కసరత్తు జరుగుతుంది. పీడీ గారు నివేదిక తయారు చేస్తున్నారు. కలెక్టర్ అనుమతితో ఖాళీలన్నీ భర్తీ అవుతాయి

? : సూపర్‌వైజర్ల ఆకస్మిక తనిఖీలు ఎక్కడా కనిపించడంలేదు.

! : మా శాఖలో సూపర్‌వైజర్ల కొరత తీవ్రంగా ఉంది. ఒక్కొక్కరు 2-3 సెక్టార్లకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అయినా సాధారణ తనిఖీలను ఆపడం లేదు.

పాహి పాహి సర్వరూపా... పాహిమాం !

● నేడు నాగుల చవితి

పాహి పాహి సర్వరూప
నాగదేవ దయామయ
సత్‌సంతాన సంపత్తిం
దేహిమే శంకరప్రియ అనంతాది మహానాగ
రూపాయ వరదాయచ..
తుభ్యం నమామి, భుజగేంద్ర
సౌభాగ్య దేహమే సదా !



..అంటూ మంగళవారం నాగులచవితి సందర్భంగా మహిళలంతా ఉపవాసాలు ఉండి నాగరాజును ప్రార్థిస్తారు. తెల్లవారు జామునే స్నానం ఆచరించి పుట్టకు వరదారం చుట్టి వస్తారు. తెల్లవారిన తర్వాత పాలు, పెరుగు, నువ్వులతో చేసిన చలిమిడి, కొబ్బరికాయతో పూజలు చేసి ఉప వాసం ఉంటారు. కొందరు చంద్రోదయం తర్వాత, మరికొందరు మరుసటి రోజు ఉపవాస దీక్ష విరమిస్తారు. స్త్రీలు నాగేంద్రస్వామిని ఆరాధిస్తే మంచి సంతానం, కన్యలు ఆరాధిస్తే మంచి భర్త వస్తారని యుగాల పర్యంతం విశ్వాసం. అలాగే నాగులచవితి ఉపవాస దీక్షలు చేసిన వారికి సర్వరోగాలు తొలగి ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. ఇలా సర్పపూజలు చేయడం వలన కుజ, రాహు దోషాలు హరిస్తాయి. సర్ప పూజ, శివ పూజలతో సమానం. ఇంకా నాగుల చవితి రోజున విషసర్పాల పుట్టలోపాలు పోస్తే మనలో దాగి వున్న విషతత్వం హరిస్తుంది. మహావిష్ణువుకు పాన్పు అయిన సర్పమే అయినందున అశేష జనావళి నాగుల చవితిని నియమనిష్ఠలతో జరుపుకుంటారు. ప్రతి శివాలయంలో నాగశిలలు ఉంటాయి. నగరంలో ధర్మరాజుల స్వామి ఆలయం, శెట్టిగుంటరోడ్డు, నాగేంద్రనగర్, పొర్లుకట్ట, నిప్పో సెంటర్, డైకస్‌రోడ్డులతోపాటు పలుచోట్ల పండుగ ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా నాగులచవితికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

-నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (వైద్యం) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలోని చంద్రశేఖరపురం వద్ద నిర్మించిన ఏకలవ్య గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది సుధీర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయుల కోసం నిర్మించ తలపెట్టిన భవనాలు, ఆడిటోరియం శిలాఫలకాలకే పరిమితమయ్యాయన్నారు. ఇక్కడ 450 మంది విద్యార్థులు ఉన్నా పీఈటీ, కంప్యూటర్ ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. వైద్య చికిత్సల కోసం వైద్యులు అందుబాటులో లేరని కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ఏకలవ్య పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, సాగర్, కిశోర్ పాల్గొన్నారు.

15న కార్తీక మహా దీపోత్సవం

108 తెప్పలతో శివాకృతి
రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రత్యేకతను చాటుతూ ఈనెల 15న ఇరుకళల పరమేశ్వరిదేవి ఆలయం సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద కార్తీక మహాదీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 15న ఉదయం శివుడికి పవిత్ర అభిషేకాలు, సాయంత్రం మహిళామణులతో శోభాయాత్ర, గంగా హారతి ఉంటుందన్నారు. హరిద్వార్ నుంచి వచ్చే ఐదుగురు ప్రధాన అర్చకులతో ఈ హారతి ఘట్టాన్ని అద్భుతంగా చేపట్టబోతున్నామన్నారు. అక్కడే హోమాలుంటాయన్నారు. నెల్లూరు చెరువులో 108 తెప్పలతో శివాకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతుందన్నారు. ఈ వేడుకల్లో నెల్లూరులోని ప్రజలందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరగాళమ్మ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మహా కార్తీక దీపోత్సవాన్ని విజయవంతం చేద్దాం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహా కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కే వెన్నెల తెలిపారు. తొలి కార్తీక సోమవారం సందర్భంగా గణేష్ ఘాట్‌లోని స్వర్ణ లింగేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ దీపోత్సవానికి నెల్లూరు నగరం నలుమూలల నుంచి లక్షమందికిపైగా మహిళలు హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహిళలను ఆహ్వానిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులతో కలిసి ఆలయ ప్రాంగణంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపారాధన చేశారు. ప్రధాన కార్యదర్శి భయ్యా రంగమల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద, సమన్వయకర్త పీ సురేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, ఉమాదేవి, గురవమ్మ, ఓలేటి సత్యనారాయణ, కోడూరు జయరాం, ముక్కాల వ్యాసప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మంత్రి నారాయణ సహకారంతో పార్కుల అభివృద్ధి



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఉచ్చి భువనేశ్వరప్రసాద్

నెల్లూరు (వైద్యం) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో నగరంలోని 13, 14వ డివిజన్లలో పార్కులను అభివృద్ధి చేస్తామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని 14వ డివిజన్‌లో ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి పార్క్ అభివృద్ధిపై వాకర్స్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ డివిజన్ గ్యాస్ గోడౌన్ దగ్గర ఉన్న పార్కు, 14వ డివిజన్ వేపదొరువు వద్ద ఉన్న పీవీ నరసింహారావు పార్కు, మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు.

అప్రమత్తతే ఆయుధం : కమిషనర్



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (వైద్యం) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ సహకారంతో నగరంలోని 13, 14వ డివిజన్లలో పార్కులను అభివృద్ధి చేస్తామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని 14వ డివిజన్‌లో ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి పార్క్ అభివృద్ధిపై వాకర్స్‌తో చర్చించారు.

ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ 13వ డివిజన్ గ్యాస్ గోడౌన్ దగ్గర ఉన్న పార్కు, 14వ డివిజన్ వేపదొరువు వద్ద ఉన్న పీవీ నరసింహారావు పార్కు, మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కులను అభివృద్ధి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పార్వతమ్మకు నెలపొంగళ్లు

మనుబోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్వతమ్మశిల వద్ద సోమవారం నెలపొంగళ్ళ కార్యక్రమం నిర్వహించారు. పార్వతమ్మను ప్రత్యేకంగా అలంకరించి పొంగళ్ళు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దసరాకమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎగ్గిరెడ్డి వెంకటస్వామి, గూడూరు పెంచలయ్య, వేలూరు భాస్కర్ రెడ్డి, చేరెడ్డి శ్రీనువాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక సోమవార పూజలు

తోటపల్లిగూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండపం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీకామాక్షి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో తొలి కార్తీక సోమవారం సందర్భంగా ఘనంగా పూజలు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎంను కలిసిన వేమిరెడ్డి దంపతులు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందచేసిన వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనా థపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూ రు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మె ల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవా రం అమరావతిలోని సీఎం నివాసంలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వేమిరెడ్డి ప్ర శాంతిరెడ్డిని టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించటంతో సీఎంను కలిసి ధన్య వాదాలు తెలిపారు. దేవదేవుడికి సేవకు అవకాశం రావటం సంతోషంగా ఉంద ని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబె ట్టుకొనేలా శ్రీవారి భక్తులకు సేవచేస్తాన ని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతిరె డ్డి తెలిపారు.

నివాస గృహాలు, స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలి

నెల్లూరు (వైద్యం) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని 53, 5 4 డివిజన్లలో ఉన్న ని వాస గృహాలకు, స్థలాల కు వెంటనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. వెంకటేశ్వరపురంలో బాధితులతో కలిసి సోమవారం సీపీఎం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆయా డివిజన్‌లో 70 శాతం పేద, మధ్య తరగతి ప్రజలే నివసి స్తున్నారన్నారు. ఇంటిపన్నులు, భవననిర్మాణం కోసం ఫీజులు, చలానా పే రుతో రూ. కోట్లు చెల్లిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల చదువు, ఇతరత్రా అవ సరాల కోసం బ్యాంకుకు వెళితే అక్కడ రిజిస్ట్రేషన్ అయిన ఇంటికే రుణాలు ఇస్తున్నామని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీ ఫారం, పొజిషన్ సర్టిఫికెట్, హౌసింగ్ పట్టాలపై బ్యాంకులకు వెళితే రుణాలు ఇవ్వటం లేదన్నా రు. ఇదెక్కడి న్యాయమని, కలెక్టర్ స్పందించి స్థానికులు న్యాయం చేయాల న్నారు. లేదంటే ఇతర ప్రాంతాలలోని బాధితులను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే మన అజెండా : గిరిధర్



కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్,నవంబరు4, (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రతి కార్పొరేటర్ తమ తమ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను ప్రధానంగా చర్చించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రూరల్ నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన తీరుపై మాట్లాడారు.

ఆయా డివిజన్లలో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకె ళ్లాలన్నారు. వాటిపై పరిష్కారం దొరికేవరకు చర్చ జరపాలని స్పష్టం చేశారు. డివిజన్ అభివృ ద్ధికి నిధుల సమీకరణ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాల దోపిడీ

● గృహనిర్మాణ శాఖనే భ్రష్టు పట్టించారు ● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాలను దోచుకున్నారని, గృహనిర్మాణ శాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 2019కి ముందు కట్టిన ఇళ్లకు సంబంధించిన బిల్లులను కక్షపూరితంగా గత వైసీపీ పాలకులు ఆపేశారని ఆరోపించారు. దళితులు, గిరిజనులు అనే తేడా లేకుండా అందరినీ ఇబ్బంది పెట్టారని, పక్కా ఇళ్ల నిర్మాణాలు సైతం నాసిరకంగా నిర్మించి పేదలను దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమ నాయుడు, నాగార్జునరెడ్డి, రమేష్‌నాయుడు, మురళీధర్‌రెడ్డి, ధనుంజయనాయుడు, పద్మనాభ నాయుడు, చాట్ల వెంకట సుబ్బయ్య, వలిపి మునుస్వామి తదితరులున్నారు.

నెల రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ప్రత్యేక గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై 550 మందికిపైగా అర్జీలు ఇచ్చారు. సోమిరెడ్డి వారి సమస్యలపై ఆరా తీస్తూ అర్జీలను స్వీకరించారు. నెల రోజుల్లో సాధ్యమైనంత వరకు అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈనెల 8న గిరిజనుల కోసం మరో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఐటీడీఏ ఆధ్వర్యంలో చెముడుగుంట సమీపంలోని శ్రిడ్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్నవాడలో కార్తీక సోమవార పూజలు

● మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం ● కామాక్షితాయికి నవావరణ పూజలు



జొన్నవాడ ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో కార్తీక మాసం శోభ సంతరించుకుంది. తొలి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలోఇ మల్లికార్జునస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షితాయికి నవావరణ పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఆలయానికి ఉపావాసాలతో అధికసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ముందుగా ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం స్వామి,అమ్మవార్లను దర్శించుకుని దీపాలు వెలిగించారు. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి పూజ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చెరువులు, శ్మశానాల ఆక్రమణపై విచారణ జరిపించాలి

● జట్లకొండూరు గ్రామస్థుల ఆందోళన

మనుబోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెరువులు, శ్మశానాలు ఆక్రమించిన వారిపై జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు విచారణ జరిపించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జట్లకొండూరు గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెరువులు, శ్మశానాలు ఆక్రమించింది ఉపసర్పంచేనని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి అండదండలతో చెరువులను కొల్లగొట్టారన్నారు. దీనిపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉల్లాస్ ద్వారా వయోజన విద్య


మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి వయోజనులను గుర్తించి ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలలో సాయంత్రం 2 గంటల పాటు చదువు నేర్పించాలని సూచించారు. శిక్షణ పొందేవారందరికీ త్వరలోనే పుస్తకాలు రానున్నాయన్నారు. స్వయం సహాయక సంఘాల్లో అక్షరాస్యులై ఉండి, ఆసక్తి కలిగిన మహిళలను వాలంటీరీ టీచర్‌గా గుర్తిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏపీఎం వనజాక్షి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో, విద్యుత్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన రూ.2.28లక్షల పెట్టుబడి రుణం, రూ.78వేలు సబ్సిడీతో కోటి ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై సోమవారం బుచ్చి మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీఓ సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినియోగదారులు ఉత్పతిచేసే సోలార్ విద్యుత్ వారి అవసరాలకు పోను మిగిలిన విద్యుత్‌కు ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.19 ప్రభుత్వం వినియోగదారుల బ్యాంకు ఖాతాకు జమచేస్తుందన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నారాయణ, విద్యుత్‌శాఖ డీఈఈ సతీష్, ఏఈఈ మనోహర్. దామరమడుగు ఏఈఈ, సిబ్బంది పాల్గొన్నారు.





వెంకటగిరి పట్టణం రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలోని శివయ్య గోపురం వద్ద దీపారాధన

కార్తీక శోభ

శైవాలయాలకు పోటెత్తిన భక్తజనం

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం జిల్లాలోని శైవాలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లోని కోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ పరిసరాల్లో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తోడు అయ్యప్ప భక్తుల తాకిడితో తిరుపతిలోని కపిలతీర్థం కళకళలాడింది. శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. అనుబంధ శివాలయాల్లోనూ పూజా కైంకర్యాలు జరిపి దీపాలు వెలిగించారు. సూళ్లూరుపేటలోని నాగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం చుట్టూ మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మన్నారు పోలూరు సంతానేశ్వర స్వామి ఆలయం, కల్యాణేశ్వర స్వామి ఆలయాల్లోనూ భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. తిరుచానూరులోని యోగిమల్లేశ్వర స్వామి ఆలయంలోనూ కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.





తిరుపతి నగరం కపిలతీర్థంలో కార్తీక దీపాల సందడి



దీపాలతో వెలుగుతున్న నారదపుష్కరిణి

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారద పుష్కరిణిలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా పుష్కరణి చుట్టూ నేతి దీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష హారతులు సమర్పించాక లక్షదీపోత్సావాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రిషితా రెడ్డి దంపతులు దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో మొదటిసారి జరిగిన ఈ విశేష వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. దీప కాంతులతో నారదపుష్కరణి దేదీప్యమానంగా ప్రకాశించింది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఆకాశ దీపం

విమానాశ్రయాలకు దీటుగా
రైల్వే స్టేషన్ల అభివృద్ధి

● స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ తదితరులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు4 (ఆంధ్రజ్యోతి): దేశంలో విమానాశ్రయాలకు దీటుగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో సోమవారం నూతన భవనాల నమూనాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన రైల్వే స్టేషన్లకు నిధులు కేటాయించిందన్నారు. మరో 50 ఏళ్ల వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అంతకు ముందు తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. రైల్వే ప్రాజెక్టుల పనితీరుపై చర్చించినట్లు సీఎం రమేష్ తెలిపారు. రైల్వే స్టషన్లలో రైళ్ల అవసరాలకు అనుగుణంగా మల్టీలెవల్ ప్లాట్‌ఫారాలు, రైలు మార్గాల్లోని అత్యవసర ప్రదేశాల్లో అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో అన్ని హంగులతో ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు కె.సదాశివరెడ్డి, బాబు, మునికుమార్, మెండ్రిపాల్ హెచ్‌ఆర్‌ఏ పెంచాలని కోరుతూ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి రైల్వే కూలీపోర్టర్లు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్, భోలేసింగ్, మహరాజ్‌తో పాటు పలువురు సభ్యులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్, సీఈ సూర్యనారాయణ, సీఏవో సత్యప్రకాష్, డీఆర్ఎం విజయకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నస్వరెడ్డి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పైసీ ప్యారడైజ్ సీజ్

● లోపలంతా అపరిశుభ్రం.. భారీగా బొద్దింకలు
● అపరిశుభ్ర హోటళ్లపై కఠినంగా వ్యవహరిస్తామన్న హెల్త్ ఆఫీసర్



హోటల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

తిరుపతి (ఉపాధ్యాయనగర్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హోటల్లోని వంటగది అపరిశుభ్రంగా ఉంది. బొద్దింకలు తిరగాడుతున్నాయి. దీంతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని స్పైసీ ప్యారడైజ్ హోటల్‌ను సోమవారం అధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్విగ్గీ యాప్ ద్వారా స్పైసీ ప్యారడైజ్ హోటల్లో బకెట్ బిర్యానీకి ఓ వినియోగదారుడు ఆర్డర్ పెట్టారు. రూ.1255 చెల్లించారు. ఆ బిర్యానీలో బొద్దింక ఉండటం.. హోటల్ నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అతడు ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఇది 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవడంతో సోమవారం ఆహార భద్రతాధికారులు, మున్సిపల్ ఆరోగ్యాధికారులు స్పైసీ ప్యారడైజ్ హోటల్లో తనిఖీలు నిర్వహించారు. వంటగది అత్యంత అపరిశుభ్రంగా ఉండటం, బొద్దింకలను చూసి అధికారులు నివ్వెరపోయారు. పాత్రలకు మూతలు లేవు. కోల్డ్ స్టోరేజీకి సరైన పద్ధతి అమలు చేయకపోవడం తదితరాలను అధికారులు గుర్తించారు. అన్ని ఆహార పదార్థాల నమూనాలు సేకరించారు. హోటల్‌ను తాత్కాలికంగా మూత వేశారు. నిబంధనలన్నీ పాటిస్తూ మార్పులు చేశాకే మళ్లీ తెరిచేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. తాము గుర్తించిన లోటుపాట్లను పేర్కొంటూ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కాగా, ఆహార భద్రతా నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ అన్వేష్ హెచ్చరించారు. స్పైసీ ప్యారడైజ్‌లో తీసిన ఆహార పదార్థాల నమూనాలకు సంబంధించి ల్యాబ్ రిపోర్టులు వచ్చాక మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తనిఖీల్లో పాల్గొన్నారు.

శిల్పారామంలో గేమ్‌జోన్‌కు తాళం

● విషమంగా గౌతమి ఆరోగ్యం



తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో గేమ్‌జోన్‌కు తాళం పడింది. ఆదివారం సాయంత్రం క్రాస్‌వీల్‌లో సీటు విరిగి 20 అడుగుల కింద పడటంతో లోకేశ్వరి మృతిచెందగా, గౌతమి గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతున్న గౌతమి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై శిల్పారామం సంస్థల సీఈవో స్వామినాయుడు ఇక్కడి ఏవో ఖాదరవల్లితో మాట్లాడారు. ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యంగా ఎందుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శిల్పారామంలోని గేమ్‌జోన్‌లోని ఆటవస్తువుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలన్నారు. సక్రమంగా ఉంటేనే తిరిగి గేమ్ జోన్‌ను పునరుద్ధరించాలని సూచించారు. ఘటనపై విచారణ చేయనున్నట్లు తెలిసింది. కాగా, క్రాస్ వీల్ కాంట్రాక్టర్ ప్రభాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు.

రేపే టీటీడీ బోర్డు ప్రమాణ స్వీకారం

● నేడు తిరుమలకు రానున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన టీటీడీ ధర్మకర్తల మండలి బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుంది. చైర్మన్‌గా బీఆర్ నాయుడితో పాటు 17 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది. దీనికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. కాగా, చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని ఆయన సొంతూరు దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు తిరుమలలోని గాయత్రి అతిథిగృహానికి చేరుకుంటారు.



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35వేలమంది స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నట్లు అధికారుల అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరునగరిలో భూకైలాస్


● రూపుదిద్దుకుంటున్న మహా నంది-శివలింగ మందిరం

● రూ. 5కోట్ల వ్యయంతో ఎత్తయిన నిర్మాణం

● బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివభక్తులకు కానుక



భవనంపై భాగంలో ప్రతిష్ఠించనున్న నంది, శివ పార్వతుల విగ్రహాలు



రూపుదిద్దుకుంటున్న మూడంతస్తుల శివలింగ మందిరం

తిరుపతి అనగానే ఠక్కున వేంకటేశ్వర స్వామి గుర్తుకు వస్తారు. పుణ్యక్షేత్రంగా తిరునగరి ఇప్పుడు మరో ఆధ్యాత్మిక కేంద్రం కొలువుదీరనుంది. ప్రముఖ దర్శనీయ స్థలాల సరసన ఇది చోటు సంపాదించుకోనుంది. భక్తులను పరవశుల్ని చేసేలా అపురూప 'నంది-శివ లింగ మందిరం' రూపుదిద్దుకుంటోంది. ఇది దేశంలోనే మూడవదిగా చెబుతున్నారు. రాష్ట్రంలో రెండో ఎత్తయిన శివ లింగ మందిరంగా నిలిచేం ద ం క ం సమాయత్తమవుతోంది. పుట్టపర్తిలో 75 అడుగుల ఎత్తులో ఇదే నమూనాతో శివలింగ మందిరం ఉంది. బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి శివారు మంగళం క్వార్టర్స్ సమీపాన నంది-శివలింగ మందిర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పదెకరాల విస్తీర్ణంలో బ్రహ్మకుమారీల ఆశ్రమంలోనే ఈ మందిరం ఏర్పాటు కానుంది. 1.25ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత, ఆహ్లాదకర వాతావరణంలో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో మూడంతస్తుల మందిర నిర్మాణాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గతేడాది అక్టోబరులో పనులు మొదలవగా.. ఇప్పటికి సగం పనులు పూర్తయ్యాయి. భక్తులను ఆకట్టుకునేలా మందిరాన్ని నిర్మించేందుకు 50 మంది శిల్పులు నిత్యం శ్రమిస్తున్నారు.

శివలింగమందిర విశేషాలు

భూమట్టం నుంచి 67అడుగుల ఎత్తు, 67అడు గ ం ల వెడల్పు చుట్టుకొలత మధ్య మూడు అంతస్తుల్లో శివలింగమందిరాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో వేంకటేశ్వర స్వామి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మొదటి అంతస్తులో రాజయోగ అభ్యాసనం వీడియో షో ప్రదర్శించనున్నారు. ధ్యానం చేసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నారు. మెట్ల సదుపాయం కూడా ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

సిద్ధమవుతున్న భారీ నంది

శివలింగం ముందుభాగాన శివనామాలు, మూడోనేత్రానికి సమాన ఎత్తులో మరో నిర్మాణం చేపట్టారు. దాదాపు 60అడుగుల ఎత్తులో భారీ నంది ఏర్పాటు కానుంది. శివుని మూడో నేత్రం, నంది నయనాలు సమాన కొలతతో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 24అడగుల పొడవు, 16అడుగుల ఎత్తుతో భారీ నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సరికొత్త ఆలోచనలే పెట్టుబడి

● 'అగ్రి'లో అంకుర సంస్థలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ వీసీ జేవీ రమణ, ఏడీ రమణ తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలలో సరికొత్త ఆలోచనలు కలిగి అంకుర సంస్థలు ఏర్పాటు చేయదలచిన ఔత్సాహికుల నుంచి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని అంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రం ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు స్కీమ్‌ల ద్వారా ఈ దరఖాస్తులను కోరుతున్నారు. వినూత్న ఆలోచన వరకే పరిమితమైన వారికి యోచ్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు, ప్రోటోటైప్ నమూనా ఉన్న వారికి అగ్రి ఇన్వో ద్వారా రూ.25లక్షల వరకు ఫండింగ్ అందించనున్నారు. ఈ ఏడాది కొత్తగా మెరిస్టమ్స్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఇందులో నూతన ఆలోచనలతో వ్యవసాయ అంకుర సంస్థలు నెలకొల్పేందుకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులకు(కోర్సు పూర్తి) రూ.4లక్షల వరకు ఐడియా ఫండింగ్ అందిస్తారు. ఈ పథకాల ద్వారా ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఫండింగ్ ద్వారా అంకుర సంస్థల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారు. వచ్చేనెల 4వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇతర వివరాల కోసం 'ఏఎన్‌జీఆర్‌ఏయూఆర్‌ఏబీఐటీపీటీ.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంది. ఈ కేంద్రం ద్వారా నిర్వహించే 8వ బ్యాచ్‌కి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రమణతో ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి కలసి విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కదిరి మోహన్, కోప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ ప్రారంభం

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని అంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రంలో సోమవారం 7వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. వ్యవసాయ, వెటర్నరీ రంగాలను అనుసంధానిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి సూచించారు. వ్యవసాయ ఇంజనీరింగ్‌లో వస్తున్న ఆవిష్కరణలను వివరించారు.

చెంచయ్య మృతదేహానికి రీ పోస్టుమార్టం



పటిష్ఠ పోలీసుల భద్రత నడుమ పోస్టుమార్టం చేస్తున్న వైద్య బృందం

పెళ్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున గత నెల 23న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బండి చెంచయ్య మృతదేహానికి సోమవారం రీ పోస్టుమార్టం జరిగింది. వడ్డిపాలేనికి చెందిన చెంచయ్య గత నెల 23న మృతి చెందగా 24న నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నాయుడుపేటలో జరిగిన పోస్టుమార్టంపై తమకు నమ్మకం లేదని, మరోసారి పోస్టుమార్టం చేసి న్యాయం చేయాలని మృతుడి భార్య ప్రమీలమ్మ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 29న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు.. సోమవారం రీపోస్టుమార్టం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో తిరుపతి స్విమ్స్ వైద్యులు గ్రామానికి చేరుకుని బంధువులు, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి మళ్లీ పోస్టుమార్టం చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు, ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల నియామకాల సమగ్ర సమాచారమివ్వండి

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో 2008 ఏప్రిల్1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని ఏపీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారి గత నెల 29న జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగుచూసింది. వర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేసే జి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.రాజేష్‌రెడ్డిలకు సంబంధించిన సర్వీస్ రికార్ట్స్‌తో పాటు వీరిద్దరిపై ఏమైనా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయా..? అలా ఉంటే ఫైల్‌తోపాటు కేసుల స్థితివంటి సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వర్సిటీ నిధుల్లో చేసిన డబుల్ పేమెంట్స్, దీనికి సంబంధించి న్యాయపరమైన సమస్యలు, పునరుద్ధరణ వంటి వివరాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ పద్ధతిలో చేపట్టిన కంపాజినేట్(కారుణ్య) నియామకాల సమాచారాన్ని అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అంతకు ముందు అంగ్రువర్సిటీలో వెటర్నరీ అంతర్భాగంగా ఉన్నప్పుడు చేపట్టిన మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై కోర్టులో కేసు నడుస్తుందని, వీటిపై కూడా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఏజీ కార్యాలయం నుంచి సమాచారం అడగడంతో పలువురు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్న చర్చ వర్సిటీలో నడుస్తోంది.

అది పట్టా భూమే

● అర్బన్ తహసీల్దారు వెల్లడి

తిరుపతి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 114లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి స్పందించారు. రెవెన్యూ అధికారులను తనిఖీకి పంపామని,షెడ్లు నిర్మించిన స్థలం ప్రైవేట్ వ్యక్తులదని చెప్పారు. అయితే ఆ స్థలంలోకి వెళ్లేందుకు కాలువను దారిగా మార్చుకున్నట్లు ప్రాథమిక సర్వేలో గుర్తించామన్నారు.ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకుని చేశారా లేదా తెలుసుకునేందుకు మంగళవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూఅధికారులతో సంయుక్తంగాకాలువ ఆక్రమణ అంశంపై విచారణ జరుపుతామన్నారు.

రోజావి నిరాధార ఆరోపణలు

● ఆమెను అరెస్టు చేయాలంటూ తెలుగు మహిళల ఫిర్యాదు



రోజాపై ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న తెలుగు మహిళలు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి రోజాను వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం పుత్తూరు ఎస్‌ఐ ఓబయ్యకు ఫిర్యాదు చేశారు. 'టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆడపిల్లల్ని రేప్ చేస్తుంటే, తగలబెడుతుంటే, ముక్కలు ముక్కలుగా నరికేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత కేసులు పెట్టడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏమి చేస్తున్నాడు' అంటూ రోజా నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న తప్పుపట్టారు. మూడున్నరేళ్ల చిన్నారి అఘాయిత్యానికి గురై.. తల్లిదండ్రులు గర్భశోకంలో ఉంటే మంత్రి రోజా ఆస్పత్రి వద్ద రాజకీయాలు మాట్లాడటం దారుణమన్నారు. గత ప్రభుత్వ గంజాయి మూలాలతోనే ఇప్పుడు జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు టీడీపీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బసంతి, కౌన్సిలర్ భువనేశ్వరి, భారతి, నాగరత్న, రజినీ, మోహన తదితరులు పాల్గొన్నారు.



సైబర్ క్రైం అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ

డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సైబర్ క్రైం వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ భాగమైపోయాయని, దీన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు సులభంగా బురిడీ కొట్టిస్తున్నారన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని తోటి వారిని చైతన్యపరచి సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత, ఉద్యోగులు, మహిళలు, ఐటీ నిపుణులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వీసీ ఉమ కోరారు. అవసరం లేని యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సైబర్ క్రైం నిపుణుడు ఐఎల్ నరసింహారావు సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీఎస్పీలు వెంకటనారాయణ, శ్రీలత, మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యులు, పోలీసు అధికారులు, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 181 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారం కాని సమస్యలు ఎందుకు అనేది వివరణాత్మకంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు అందగా రెవెన్యూ శాఖవే 119 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ వర్సిటీలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి జయచంద్ర డిమాండు చేశారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా 2012 చట్టం ప్రకారమే జీతాలు అందిస్తున్నారన్నారు. ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, మునిరాజా, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ నాగరత్నమ్మ, మస్తాన్, పరశురామ్ పాల్గొన్నారు.

అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోండి

ఇటీవల కాలంలో పెరిగిపోతున్న అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మద్యం, డ్రగ్స్ కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వడమాలపేట మండలంలో చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తమ గ్రామంలో మేత పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారని ఓజిలి మండలం, మనవాలి గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు రికార్డులు సృష్టించి, ఆక్రమించుకున్నారని తెలిపారు. రీసర్వేలోనూఅవకతవకలు జరిగాయని, 2.93సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమార్కులు తమ పేరుతో బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై విచారణ జరపాలని విన్నవించారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు మునేంద్ర మాట్లాడుతూ గ్రామీణుల ఆరోగ్య విషయంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తారని, అలాంటి వారికి రూ.10వేలు గౌరవ వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని అన్నారు. జీతాలు పెంచి, పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీరా, జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రసూతి సెలవులు 3 నెలలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు పద్మావతి, లక్ష్మమ్మ, సుందరమ్మ, శారద, అమరావతి, సుగుణ, మంగమ్మ, సరిత పాల్గొన్నారు.

మీ సర్వేయరే నా స్థలం కబ్జా చేశాడు

● గ్రీవెన్స్‌లో ఆర్డీవో వద్ద బాధితుడి ఆవేదన



బాధితుడు సుబ్బన్న

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర పనిచేసే సర్వేయరే నా స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టేసుకున్నాడు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగడంలేదు. మీరైనా సర్వే చేయించి న్యాయం చేయండి' అంటూ ఆర్డీవో రామ్మోహన్ ముందు ఓ బాధితుడు ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో రూరల్ మండలం అవిలాల గ్రామానికి చెందిన వి.సుబ్బన్న వినతి పత్రం అందజేశారు. డాక్యుమెంట్లు పరిశీలించిన ఆర్డీవో ఇప్పటి ఈసీ తీసుకొస్తే జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్‌తో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా బాధితుడు సుబ్బన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 28/3లో 10 సెంట్లు, 28/4లో 0.39 సెంట్లు, 28/2లో 27 సెంట్లు స్థలం అనువంశికంగా మా స్వయార్జితం. 28/3లో చిట్టిబాబు అనే సర్వేయర్‌కు 30 అంకణాల భాగం విక్రయించాను. ఆ స్థలాన్ని వేరేవాళ్లకు విక్రయించేసి, 28/4లో నేను నిలుపుకొన్న స్థలాన్ని ఆక్రమించి 40 అంకణాలకు పైగా ఇల్లు నిర్మించుకున్నాడు. సదరు స్థలాలను సర్వే చేయడానికి రూరల్ తహసీల్దారును పలుసార్లు కోరినా సర్వేయర్లు ముందుకు రావడంలేదు. సర్వే నివేదిక ఇవ్వడంలేదు. అతడు సర్వేయర్ కావడంతో ఇతర సర్వేయర్లు నాకు సహకరించడంలేదు. గత వారం గ్రీవెన్స్‌కి వచ్చినప్పుడు తనపై దాడి చేస్తున్నానని నాపై సర్వేయర్ చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆర్డీవోను కలవనీయకుండా చేశారు. జిల్లా సర్వేయర్ ద్వారా 28/3, 28/4 నెంబర్లకు సర్వే జరిపి మాకు హద్దులు చూపించాలని కోరుతున్నా' అని విజ్ఞప్తి చేశారు. దీనిపై చిట్టిబాబును వివరణ కోరగా తాను కొనుగోలు చేసిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు.

పాముకాటుతో బాలుడి మృతి



చరణ్ (ఫైల్‌ఫొటో)

వాకాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... బాలిరెడ్డిపాళెం బండ్లదిబ్బ గ్రామానికి చెందిన పంత్రాంగం మస్తానయ్య తన ఇద్దరు కుమారులతో కలిసి ఆదివారం రాత్రి ఒకే మంచంపై నిద్రించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కుమారుడు చరణ్(16) కుడిచేయ్యి నొప్పిగా ఉందని అరిచాడు. ఎలుక కరిచి ఉంటుందిలే, నిద్రపోమ్మని మస్తానయ్య చెప్పడంతో చరణ్ పడుకుండిపోయాడు. మరో అరగంట గడిచాక కళ్లు మూసుకుపోతున్నాయని, ఒళ్లంతా నొప్పిగా ఉందని కుమారుడు చెప్పడంతో మస్తానయ్య లేచి కుడిచేతిని పరిశీలించగా రెండు గాట్లు పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఆటోలో వాకాడు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో 108వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే చరణ్ మృతి చెందినట్లు తెలిపారు. కొడుకు కళ్లముందే ప్రాణాలు వదలడంతో మస్తానయ్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భూ ఆక్రమణలను తొలగించండి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి గ్రామంలో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, విచారించి ఆక్రమణలను తొలగించాలని బీజేపీ నాయకులు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి గ్రామంలో పదిమందికి ప్రభుత్వ భూమిని పంపిణీ చేసి పట్టాలను మంజూరు చేశారన్నారు. అయితే ఇదే భూమిని వాకాడు మండలం ముట్టెంబాక రైతులకు కూడా పట్టాలు ఇచ్చారన్నారు. దీంతో ఇరు గ్రామాల వారు భూముల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో పిట్టివానిపల్లి గ్రామానికి చెందిన కొందరు ఈ భూములను ఆక్రమించుకుని రికార్డులను తారుమారు చేశారన్నారు. సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి భూములను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పనబాక కోటేశ్వరరావు, దయాకర్, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్‌కు వినతులు అందజేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించండి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ ప్రభుత్వ పెట్టుబడి సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సీవీసీ పార్కులోని సచివాలయంలో సిబ్బందికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులు సాగుచేస్తున్న పంటలకు పంటబీమా నగదును ప్రభుత్వమే భరించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, చంద్రయ్య, అంకయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ టీడీపీనే అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5లక్షల బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, శ్రీధర్, ఇశ్రాయిల్‌కుమార్, వేముల సునీల్, జనార్ధన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

గూడూరు, వెంకటగిరి టౌన్, నాయుడుపేట టౌన్, కోట, పెళ్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాశాఖ ఏడీ గోపీ నాయక్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వరి విత్తనాలు విక్రయించాలని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు అమ్మకాలు సాగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో రమేష్ పాల్గొన్నారు. ● వెంకటగిరిలోని విత్తన దుకాణాల్లో ఏడీఏ నాగార్జున సాగర్, ఏవో సుజాత తనిఖీలు నిర్వహించారు. దుకాణాల వద్ద ధరలు పట్టిక ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ● నాయుడుపేట పట్టణంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి గణేష్ తనిఖీ చేశారు. విత్తనాల నాణ్యత, స్టాక్ వివరాలను పరిశీలించారు. ● కోట మండల పరిధిలోని గూడలి, విద్యానగర్, కోటతో పాటు రైతు సేవాకేంద్రాల్లోని వరి విత్తనాల గోదాములను మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయా గోదాముల్లో ఉన్న వరి విత్తనాలను పరిశీలించారు. రైతులకు కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ విత్తనాలు సబ్సిడీపై ఇవ్వనున్నట్లు ఏవో తెలిపారు. ● పెళ్లకూరు మండలంలోని చెంబేడు, శిరసనంబేడు రాజుపాలెం గ్రామాల్లో విత్తనాల దుకాణాలను మండల వ్యవసాధికారి గొడవర్తి ప్రవీణ తనిఖీ చేశారు.వరి విత్తానాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశానవాటికలో పిచ్చిమొక్కల తొలగింపు

నాయుడుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీరదవాడ హిందూ శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లను మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా సోమవారం తొలగింపజేశారు. శ్మశానవాటిక పిచ్చి మొక్కలతో నిండిపవడంతో పాటు దారి ముళ్లచెట్లతో మూసుకు పోవడంతో దహన సంస్కారాలకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ స్థానికులు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీరదవాడ శ్మశానవాటికలో పిచ్చిమొక్కలను తొలగించారు.

కార్తీక పూజలు



నాయుడుపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



గూడూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



గూడూరు శివాలయంలో శివపార్వతులకు పల్లకీసేవ

గూడూరు, వెంకటగిరి టౌన్, నాయుడుపేట టౌన్, తడ, సూళ్లూరుపేట, కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గూడూరు పట్టణంలోని శివాలయం, వీరభద్రస్వామి, సంఘమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివాలయంలో శివపార్వతులకు పల్లకీసేవ నిర్వహించారు. ● వెంకటగిరి పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిశాయి. పట్టణంలోని కాశీ విశ్వనాధస్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో మహిళలు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ● నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసన్నాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే మహిళలు ఆలయానికి చేరుకొని పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక సోమవారం కావడంతో మహిళలు, అయప్పస్వామి మాలధారణ భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ● తడ మండలం చిన్నమాంబట్టులో ఉన్న అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్లకు విశేష పూజలు జరిగాయి. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయంలో కోలాట నృత్యాలను ప్రదర్శించారు. అలాగే బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామికి 101 లీటర్లతో పాలతో అభిషేకం చేశారు. ● సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విశేష పూజలు జరిపారు. అదేవిధంగా మన్నారు పోలూరు సంతానేశ్వరస్వామి, కల్యాణేశ్వరస్వామి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ● కోట మండల పరిధిలోని గూడలిలోని కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడు, గూడలి తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరి ఆలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలకు పలు అభిషేకాలు జరిగి విశేషంగా అలంకరించారు. ప్రధానార్చకులు కార్తీక్‌స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సంఘమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సంఘమేశ్వరుడి స్వామివారి తీర్థాన్ని మేళతాళాలతో తీసుకెళ్లి తిప్పపై వెలసిన భీమేశ్వర విగ్రహానికి అభిషేకం చేశారు.







కోట: ప్రత్యేక అలంకరణలో సంఘమేశ్వరుడు - నాయుడుపేట శివాలయంలో అయ్యప్పస్వామి భక్తులు - సూళ్లూరుపేట: నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

నాయుడుపేట రైల్వే స్టేషన్‌ను అమృత్‌భారత్ పథకంలో చేర్చండి



ఎంపీ సీఎం రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సదరన్ రైల్వే అసోసియేషన్ సభ్యులు

నాయుడుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్ స్కీమ్‌లో చేర్చాలని రైల్వే ప్యాసింజర్ అసోసియేషన్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి కోరారు. సోమవారం రేణిగుంటలో ఎంపీ సీఎం రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట సమీపంలో మేనకూరు సెజ్ ఉండడంతో వివిధ రాష్ట్రాల ప్రయాణికులు స్థానిక రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు పని కల్పించండి

గూడూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో ఉపాధి కూలీలకు వందరోజులు పని కల్పించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో ఏపీవో సక్రమంగా పనులు కల్పించకపోవడంతో కూలీలకు అవస్థలు పడుతున్నారన్నారు. నంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, అంకయ్య, మస్తానయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడండి

ఓజిలి, నవంబరు 4: ఓజిలి మండలం ఆరిమేనిపాడు పరిసర ప్రాంతాల్లోని సహజ వనరులను కాపాడాలని ఆ గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చుట్టుప్రక్కల మేత పరంబోకు భూములు, తిప్పలు ఉండడం వల్ల భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఇక్కడి తిప్పను గ్రావెల్ పేరుతో తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులంతా అడ్డుకున్నామని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇక్కడి తిప్పను తవ్వి తరలించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు.

గూడలిలో టీడీపీ సభ్యత్వ నమోదు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో సోమవారం టీడీపీ సభ్యత్వం నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ ఎస్సీసెల్ మాజీ ఉపాధ్యక్షుడు యల్లశిరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గూడలి, దళితవాడ, బీసీ కాలనీల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

నేడు బీవీపాళెంలో సునామీపై మాక్‌డ్రిల్

తడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సునామి విపత్తును ఎలా ఎదుర్కోవాలో తెలిపేలా మాక్ డ్రిల్‌ను బీవీపాళెం గ్రామంలో మంగళవారం నిర్వహించ నున్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ బృందాలు పాల్గొంటాయని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు.

వ్యవస్థలను భ్రష్టు పటించిన వైసీపీ: హోం మంత్రి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(నవంబరు): గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. రుషికొండ ప్యాలెస్ ఎవరి కోసం నిర్మించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కపిలతీర్థంలోని శివాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో బాబు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులతో వేద ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, అధికారులు ఉన్నారు.

13మంది పేకాటరాయుళ్ల అరెస్టు
రూ.1.54లక్షల స్వాధీనం

తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఓ హోటల్‌పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 13మందిని అరెస్టు చేశారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన మేరకు... తిరుచానూరు బైపాస్‌రోడ్డులోని స్ప్రింగ్ హిల్స్ హోటల్‌లో కొందరు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. హోటల్‌లో సోదాలు నిర్వహించగా 13మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1.54లక్షలు నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. పోలీసు అదుపులోకి తీసుకున్న వారిలో అధికార ప్రతిపక్షాలకు చెందిన నేతలు, వ్యాపారస్థులు ఉన్నట్లు తెలిసింది. గతంలో కూడా ఇదే హోటల్‌లో పేకాట ఆడుతూ పలువురు చిక్కారు. అలాగే చెంచులక్ష్మి యానాది కాలనీలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి రూ.5,300 సీజ్ చేశారు.

వైసీపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మునీంద్రబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన విధులకు భంగం కలిగించడంతో పాటు కులం పేరుతో దూషించారని రాఘవయ్యపేట వీఆర్వో నీలిమ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

లేఅవుట్ యజమానులకు నోటీసులు

దక్కిలి, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం లింగసముద్రం గ్రామం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్ యజమానులకు పంచాయతీ కార్యదర్శి సోమవారం నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లింగసముద్రం వద్ద లేఅవుట్ వేయడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం అధికారులు నోటీసులు జారీ చేయడంతో లేఅవుట్ పనులు ఆగిపోయాయి. నోటీసులు అందుకొన్న మూడు రోజుల్లోగా తగు ఆధారాలు చూపకపోతే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

షార్‌లో హిందీ భాషా వేడుకలు




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం హిందీ భాషా వేడుకలు నిర్వహించారు. హిందీని జాతీయ బాషగా గుర్తించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిని డైమండ్ జూబ్లీ ఇయర్‌గా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి హిందీ భాషా వేడుకలను ప్రారంభించారు. షార్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం షార్ డైరెక్టర్, సీనియర్ ఉద్యోగుల చేతుల మీదుగా ప్రజ్వాల్ హిందీ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెళ్లకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలోని పెన్నేపల్లి వద్ద ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమాన విధించారు.

చంద్రబాబును కలిసిన పనబాక దంపతులు



సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న పనబాక దంపతులు

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య దంపతులు సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ బోర్డులో పనబాక లక్ష్మికి స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేగేటు మూసివేత

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం నడిబొడ్డులో ఉన్న రైల్వేగేటును సోమవారం రాత్రి రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వేగేటు సమీపంలో మరమ్మతుల కోసం నాలుగు రోజుల పాటు ఈ నెల 7వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ గేటు మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్కృత వర్సిటీలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. సంస్కృత భాషలోని మహోన్నత విషయాలను దైనందిన జీవితంలో అన్వయించడం ద్వారా అవినీతి రహిత దేశాన్ని నిర్మించుకోవచ్చని చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తొలిమూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కాలుష్యం నుంచి చెరువులను కాపాడాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకుల ధర్నా

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కడివేడు చెరువులో వ్యర్థాలను కలుపుతుండడంతో కాలుష్యభరితంగా మారుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ కొందరు పోర్టు నుంచి కెమికల్స్ వ్యర్థాలను తెచ్చి కడివేడు చెరువులో కలుపుతున్నారన్నారు. దీనివ్ల చెరువులో నీళ్లు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, వాటిని తింటున్న గ్రామస్తులు అనారోగ్యానికి లోనవుతున్నారన్నారు. కలుషిత జలాలు తాగుతున్న మూగజీవాలు సైతం అనారోగ్యాని లోనై మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కడివేడు, కమ్మవారిపాళెం, ముత్యాలపాడు తదితర చెరువుల్లో కూడా పరిస్థితి నెలకొందన్నారు. వ్యర్థాల కారణంగా చెరువుల్లో కలుషితం అవుతున్న నీటితో పంటలు సాగు చేసినా సరైన దిగుబడులు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పలుమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులను కాలుష్యం నుంచి కాపాడాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, శ్రీనివాసులు, చంద్రయ్య, శంకరయ్య, నారాయణ పాల్గొన్నారు.

షటిల్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



షటిల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఓపెన్ ప్రభాకరన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గూడూరు క్రీడాకారులు ప్రతిభచాటారు. చెన్నైలో ఆదివారం జరిగిన తమిళనాడు ఓపెన్ ప్రభాకరన్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో గూడూరు హెచ్‌డీ ఎరినా స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు అండర్-15 విభాగంలో షాహీర్, అండర్ -9, అండర్ -11 విభాగంలో యశ్విన్ విజేతలుగా నిలిచారు. గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో అధ్యాపక శిక్షణ తరగతులు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అటల్ అధ్యాపక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. అప్లికేషన్స్ ఆఫ్ ఫ్రైవేట్ ఎలిమెంట్ అనాలసిస్ ఇన్ ఆడిట్యూ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్స్ అనే అంశంపై ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయి. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ధర్మయుద్ధ సభను జయప్రదం చేయండి

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 14న జరిగే మాదిగల ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు రవి పిలుపునిచ్చారు.

నైపుణ్యాల సర్వేపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ కార్యదర్శులు

ఓజిలి, నవంబరు 4: మండల పరిధిలోని గ్రామాల్లో వివిధ అంశాల్లో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎల్‌డీవో జాలిరెడ్డి తెలిపారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి సచివాలయ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 18-59 ఏళ్ల మధ్య వయస్కుల వారు ఏఏ రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారో సర్వే చేసి నమోదు చేయాల్సి వుంటుందన్నారు. కార్యదర్శులు క్లస్టర్ వారీగా గ్రామాల్లో సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఉషారాణి, ఏపీఎం పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.